RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

తెలంగాణ తల్లి

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

ఎడిటర్ : బూర్ల వెంకన్న కరీంనగర్ సంపుటి :17 సంచిక :308 గురువారం, మార్చి 05, 2026, పేజీలు -20 వెల :5/-

# సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

## అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి : సింగూర్ డ్యామ్ భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరాని కి ప్రాణాధారంగ నిలిచిన సింగూర్ ప్రాజెక్టు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుం టుందని ఆయన తెలిపారు. స్వయంగా తాను సింగూర్ ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని ఆయన ప్రకటించారు. బుధవారం ఉదయం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సితక్కవివేక్ వెంకటస్వామిలతో కలసి డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయం లో ఆయన నీటి పారుదలశాఖ ఇంజినీర్లతో ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. - మిగతా2లో



# మోడీ పర్యటనలకు దాడులకు లింకేంటి

## విమర్శలకు దీటుగా స్పందించిన ఇజ్రాయిల్

తెలంగాణ పత్రిక ప్రతినిధి : ఇరాన్ - ఇజ్రాయెల్ దేశాల మధ్య గత ఐదు రోజుల నుంచి యుద్ధం నడుస్తోంది. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తం గా ఇరాన్ పై బాంబు దాడులు చేశాయి. ఇరాన్ నాయకులే లక్ష్యంగా టెహ్రాన్‌లోని 30 చోట్ల బాంబు దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, ఆయన భార్య, కూతురు, అల్లుడు, మనవడు ప్రాణాలు కోల్పోయారు. శనివారం జరిగిన దాడుల్లో ఖమేనీ చనిపోగా మరుసటి రోజు ఈ విషయా న్ని ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇజ్రాయెల్, అమెరికాల పై ప్రతి దాడులకు దిగింది. ఖమేనీ మృతి చెందినా ప్రధాని మోడీ స్పందించడం లేదని, - మిగతా2లో



# ఇరాన్ నేతగా ఖమేనీ కుమారుడు ముజ్తబా

## అధికారికంగా వెల్లడించడమే తరువాయి



తెలంగాణ పత్రిక ప్రతినిధి : అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీఖమేనీ మరణించడంతో ఇరాన్ తదుపరి నాయకత్వంపై సందిగ్ధం నెలకొంది. ఎవరు పగ్గాలు అందుకుంటారన్న చర్చలో ఖమేనీ కుమారుడే ముందువరసలో ఉన్నట్లు సమాచరం. ఇప్పుడా పాలనా పగ్గాలను ఖమేనీ కుమారుడు ముజ్తబా హాశస్సేనీ ఖమేనీకి అప్పగించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ లేని ముజ్తబా.. త్వరలోనే సుప్రీంలీడర్ గా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. ఆయతుల్లా అలీ ఖమేనీ రెండో కుమారుడే ముజ్తబా. 1969లో ఇరాన్‌లోని మషాద్‌లో జన్మించారు. ముజ్తబా పదేళ్ల వయసులోనే - మిగతా2లో

# తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థుల ఘర్షణ

తెలంగాణ పత్రిక ప్రతినిధి : తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థుల మధ్య ఉద్రిక్తతలు నెల కొన్నాయి. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో ఉన్న వర్సిటీలోని సౌత్ క్యాంపస్ వసతీ గృహంలో మంగళ వారం అర్ధరాత్రి విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. హోలీ సంబరాల అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు రెండు - మిగతా2లో

# జైలు నుంచి విడుదలయిన బాల్క తదితరులు

## మీడియా ముందు బాల్క సుమన్ ఆరోపణలు



తెలంగాణ పత్రిక ప్రతినిధి : బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భం గా మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సహా బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులో జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు - మిగతా2లో

# డిజిటల్ జనగణనకు తెలంగాణ సిద్ధం.. మే 11 నుంచి తొలి దశ

- తెలంగాణలో జనగణన తొలి దశకు రంగం సిద్ధం
- మే 11 నుంచి జూన్ 9 వరకు ఇళ్ల వివరాల సేకరణ
- దేశంలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ విధానంలో లెక్కింపు
- సొంతంగా వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్
- ఏ ఒక్క ఇల్లు వదలకుండా పక్కాగా లెక్కించాలని అధికారులకు ఆదేశాలు



# పరకాల మా అడ్డా

## సురేఖ అక్కడి నుంచే పోటీ చేస్తారు

తెలంగాణ పత్రిక ప్రతినిధి : పరకాల మా అడ్డా అని, వచ్చే ఎన్నికల్లో కొండా సురేక అక్కడి నుంచే పోటీ చేస్తారని మాజ ఎమ్మెల్సీ, తెలంగాణ మంత్రి కొండా సురేఖ భర్త మురళీ - మిగతా2లో



# ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారు: ముఖ్యమంత్రి పై హరీశ్ రావు ఆరోపణలు

## ఐపీఎస్, ఐఏఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారన్న హరీశ్ రావు

తెలంగాణ పత్రిక ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కలెక్టర్ల సదస్సులో ఆయన బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈరోజు ఆయన - మిగతా2లో





# మాదిగలకు రాజ్యసభ సీటు ఇవ్వండి

తెలంగాణ పత్రిక ప్రతినిధి : రాజ్యసభ ఎన్నికల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ - మిగతా2లో

# ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు: కేటీఆర్

## తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్



తెలంగాణ పత్రిక ప్రతినిధి : ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా జరుపుతున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. దక్షిణ ఇరాన్ లోని మినాబ్ పట్టణంలో ఉన్న 'షజ్రే తయ్యెబా' బాలికల ప్రాథమిక పాఠశాలపై జరిగిన మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మరణించారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా విషాదం కలిగించింది. ఈ ఘటన పై బీఆర్ఎస్ - మిగతా2లో



# హిందూ పండగలంటే చిన్న చూపెందుకు

## సిఎం రేవంత్‌ను ప్రశ్నించిన రాజాసింగ్

తెలంగాణ పత్రిక ప్రతినిధి : హిందు పండుగలు, ముస్లింల పండుగల మధ్య తెలంగాణ ప్రభుత్వం తేడాలు ఎందుకు చూపిస్తోందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. అలాగే హిందూ పండగలపై చిన్నచూపెందు కని అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చినట్లుగానే - మిగతా2లో

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నినాదం
GENERAL NEWS

## మోడీ పర్యటనలకు దాడులకు లింకేంటి

-మొదటిపేజీ తరువాయి

ఖమేనీ మృతి చెందినా ప్రధాని మోడీ స్పందించడం లేదని, ఖండించడం లేదని విపక్ష పార్టీలు నిలదీస్తున్నాయి. మోడీ తీరువల్ల భారత్ పరువు పోయిందని గగ్గోలు పెడుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడానికి రెండు రోజుల ముందు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఫిబ్రవరి 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు మోదీ పర్యటన సాగింది. మోదీ పర్యటన ముగిసిన సరిగ్గా రెండు రోజులకు.. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్.. ఇరాన్‌పై దాడి చేసింది. ఈ విషయం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న చర్చ, సోషల్ మీడియా ప్రచారాలపై స్పందించారు. రూవెన్ అజర్ మాట్లాడుతూ.. 'అదొక ఆపరేషనల్ అవకాశం మాత్రమే. ప్రధాని మోదీ వెళ్లిపోయిన తర్వాత ఆ అవకాశం వచ్చింది. మోదీ పర్యటన సందర్భంగా ఆయనతో దేశాభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడాము. ఈ విషయం గురించి ఆయనతో చర్చించలేదు. దాడులు చేస్తామని ఆ సమయానికి మాకు కూడా తెలీదు. మోదీ వెళ్లిపోయిన తర్వాత ఇరాన్‌పై దాడి చేయాలా? వద్దా? అన్నదానిపై నిర్ణయం తీసుకోవడానికి రెండు రోజుల సమయం పట్టింది. ఇరాన్‌పై దాడులకు ఫిబ్రవరి 28వ తేదీ ఉదయం సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆ తర్వాతే దాడులు జరిపాము. దాడులకు చాలా కాలం ముందునుంచే మేము అమెరికాతో సంప్రదింపులు జరుపుతూ ఉన్నాము. సరైన సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నామని చెప్పుకొచ్చారు.మోడీ పర్యటనలో యుద్ధం గురించి ఎందుకు మాట్లాడుతామని అన్నారు.

## తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థుల ఘర్షణ

-మొదటిపేజీ తరువాయి

రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ కొట్లాటలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసు కున్న వర్సిటీ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థులను చెదరగొట్టారు. అనంతరం గాయపడిన వారికి చికిత్స అందించారు. వసతీగృహం వద్దకు స్థానిక ఎస్సై ఆంజనేయులు, వార్డెన్ డాక్టర్ యాలాద్రి అక్కడకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. విచారణ అనంతరం బాధ్యుల పై చర్యలు తీసు కుంటామని తెలిపారు.

## పరకాల మా అడ్డా

-మొదటిపేజీ తరువాయి

పరకాల తమ అడ్డా... వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచే కొండా సురేఖ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. బుధవారం గీసుగొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతరలో కొండా మురళీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తన బిడ్డా కొండా సుస్మిత ఎవరినైనా ఎదిరిస్తుందని చెప్పుకొచ్చారు. తనకన్నా కొండా సుస్మిత ధైర్యవంతురాలని తెలిపారు. కార్యకర్తలకు సమస్య వస్తే ఎవర్నీ వదలిపెట్టదని అన్నారు. ఎంతటివారినైనా ధైర్యంగా ఎదుర్కొంటుందని కొండా మురళీ పేర్కొన్నారు.

## ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారు: ముఖ్యమంత్రి పై హరీశ్ రావు సంచలన ఆరోపణలు

-మొదటిపేజీ తరువాయి

ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. రెండున్నరేళ్లలోనే ఐదుసార్లు భారీ ఎత్తున అధికారులను బదిలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ బదిలీలతో పాలన కుంటుపడుతోందని అన్నారు. పరిస్థితులను అర్థంచేసుకునే లోపే అధికారులను బదిలీ చేస్తున్నారని విమర్శించారు. జీహెచ్ఎంసీ కమిషనర్లు కూడా రెండున్నరేళ్లలో నలుగురు మారారని తెలిపారు. ముఖ్యమంత్రి లేదా మంత్రులకు నచ్చకపోతే ఆ అధికారులను వెంటనే బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. కొందరికి పోస్టింగులు ఇచ్చి జాయిన్ చేసుకోవడం లేదని విమర్శించారు. త్వరలో కాంగ్రెస్ నేతల అవినీతిని, బినామీలను బయట పెడతామని హెచ్చరించారు.

## ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు: కేటీఆర్

-మొదటిపేజీ తరువాయి

ఈ ఘటన పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల శిథిలాల కింద చిక్కుకుని మరణించిన ఆ 165 మంది బాలికల సామూహిక అంత్యక్రియలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం వెనుక కారణాలు ఏవైనా, ఇలాంటి మారణహోమాలు మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధాలు రాబోయే తరాలకు కేవలం తీరని శోకాన్ని, వినాశనాన్ని మాత్రమే మిగుల్చుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

## మాదిగలకు రాజ్యసభ సీటు ఇవ్వండి

-మొదటిపేజీ తరువాయి

ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో భర్తీకాబోతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానం మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్సీ స్థానాలైన పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్ స్థానాల్లో కూడా మాదిగలకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానమైనా మాదిగలకు అవకాశం కల్పించాలని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

# సింగూర్ డ్యామ్ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాలకు తాగునీటిని సరఫరా చేస్తూ, పరిసర ప్రాంతాలకు సాగునీరూ అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టును పరిరక్షించడంతో పాటు పునరుద్ధరణ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల నుంచి భద్రతా పరిస్థితిపై హెచ్చరికలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక జోక్యాలు, నీటిమట్టం దిగువన అండర్‌వాటర్ పరిశీలనలు, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ డ్యామ్ పై 2025 మధ్యకాలం నుండే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో నిర్వహించిన అంచనాల్లో ఎంబాంక్మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్, రివెట్‌మెంట్ నష్టం, ప్లంజ్ పూల్ సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇవి దిగువ ప్రాంతాల్లో వరద ముప్పుకు దారితీసే అవకాశాలపై ఆందోళనలు రేకెత్తించాయన్నారు. 29.91 టీఎంసీల స్థూల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్ ప్రతీ సంవత్సరం హైదరాబాద్‌కు 6,7 టీఎంసీల నీటిని సరఫరా చేస్తోందని ఆయన తెలిపారు. డ్యామ్ భద్రత విషయంలో పూర్తి బలోపేతం జరిగే వరకు అధిక ప్రమాదం కలిగించే ఆపరేషన్లు నిలిపివేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బండ్ దిగువన నీటిని పూర్తిగా వదలకుండా దాగి ఉన్న నష్టాలను గుర్తించేందుకు సోనార్ పరీక్షలు మరియు అండర్‌వాటర్ సర్వేలు చేపట్టి 2,3 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలోనే స్వయంగా ఆనకట్టను సందర్శిస్తానని ప్రకటించిన ఆయన, ఒకే సీజన్‌లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు, పంటల విరామం రాకుండా చూడాలన్నారు. ఇదే సమయంలో సింగూర్ కాలువ లైనింగ్ పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. మొత్తం 13 కి.మీ.లో 9 కి.మీ. పూర్తయ్యాయి; మిగిలిన 4 కి.మీ.ను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గత ఆగస్టులో నిల్వలను భద్ర పరిమితులకు కట్టడి చేసి, నియంత్రిత నీటి విడుదలలు ప్రారంభించినప్పుడు ఆనకట్టపై ముప్పు స్థాయి పెరిగిందని, డిసెంబర్ నాటికి దశలవారీగా ములుగు జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాలెం వాగు గేట్లు,రెగ్యులేటర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాలెంవాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలకు గాను అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 5,000 కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. జూన్ 2 వ తేదీ వరకు భూసేకరణ పూర్తి చేయాలని నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన సింగూరు ప్రాజెక్టు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ, మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులు, ఇంజనీరింగ్‌శాఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సింగూరు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తమ్ కుమార్ రెడ్డి వివేక్ వెంకటస్వామిలు చర్చించారు. డ్యామ్ సేఫ్టీ ప్రభుత్వానికి ఎంతో ప్రాధాన్యత అంశం అన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు సింగూర్ డ్యాం ను పరిరక్షించాలని మంత్రులు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. సింగూరు డ్యామ్ సేఫ్టీ నిర్మాణ పనులపై టెక్నికల్ కమిటీని నియమించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

# ఇరాన్ నేతగా ఖమేనీ కుమారుడు ముజ్తబా

-మొదటిపేజీ తరువాయి

ముజ్తబా పదేళ్ల వయసులోనే ఇరాన్ రాజు మహమ్మద్ రెజా పహ్లావీకి వ్యతిరేకంగా 1979లో ఇస్లామిక్ విప్లవం జరిగింది. ఆ సమయంలో ఖమేనీ కుటుంబం రాజకీయంగా ఎదిగింది. ఆ తర్వాత వీరి కుటుంబం టెహ్రాన్‌లో స్థిరపడింది. కోమ్‌లోని సెమినరీస్‌లో మత విద్యను అభ్యసించిన ముజ్తబా లకెరికల్ ర్యాంక్‌కు చేరుకున్నారు. కానీ, అత్యున్నత ర్యాంక్ అయిన ఆయతుల్లాను అందుకోలేకపోయారు. అయినా సుప్రీంలీడర్ కార్యాలయంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తిగా మారారు.1980ల్లో జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధంలో ముజ్తబా పాల్గొన్నాడు. ఆ అనుభవమే ఇరాన్ సైన్యానికి ఆయనను దగ్గర చేసింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)తో ఆయనకు బలమైన సంబంధాలు ఉన్నాయి. ముజ్తబాకు సుప్రీం పదవి దక్కడానికి ఇదీ ఓ కారణమై ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు. సాధారణంగా సుప్రీంలీడర్ నియామకాన్ని చేపట్టేందుకు 88 మంది షియా మత పెద్దలతో కూడిన కమిటీ (అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్) ఉంటుంది. ఇందులో సభ్యులను ప్రత్యక్ష ప్రజా ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని ఈ కమిటీ భావిస్తుంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం ముజ్తబా నియామకానికి ఈ కమిటీలోని కొందరు సుముఖంగా లేరని, కానీ ఐఆర్‌జీసీ ఒత్తిడితోనే ఆయనకు పగ్గాలు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ముజ్తబా ఇప్పటివరకు ఇరాన్‌లో అధికారిక పదవులేవీ చేపట్టలేదు. బహిరంగ ప్రసంగాల్లోనూ అరుదుగా కన్పించేవారు. అయినా రాజకీయ నియామకాలు, పాలనాపరమైన నిర్ణయాల్లో తెర వెనుక కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ముజ్తబా ఖమేనీపై 2019లో అమెరికా ఆంక్షలు విధించింది. అయినా ఆయన ప్రపంచవ్యాప్తంగా సంపన్న సామ్రాజ్యాన్ని ఏర్పాటుచేయడమే గాక.. పశ్చిమ మార్కెట్లలో బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు గతంలో పలు కథనాలు వెలువడ్డాయి. ముజ్తబా నికర సంపద ఎంతనే దానిపై స్పష్టత లేదు. కానీ, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఆయనకు పెట్టుబడులు ఉన్నాయట. స్విస్ బ్యాంకు ఖాతాల్లో పెద్దఎత్తున డిపాజిట్లతో పాటు.. బ్రిటన్‌లో 138 మిలియన్ డాలర్ల విలువైన లగ్జరీ ప్రాపర్టీ ఆయన పేరు మీద ఉన్నట్లు సమాచారం. ఇరాన్ సంప్రదాయ వాద రాజకీయ నాయకుడు ఘోలమ్ అలీ కుమార్తె జహ్రాను ముజ్తబా 2004లో వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. వీరి కుటుంబం గురించి బయటి ప్రపంచానికి పెద్దగా తెలియదు. అయితే, ఇటీవల ఇజ్రాయెల్-అమెరికా జరిపిన సంయుక్త దాడుల్లో ముజ్తబా భార్య మృతి చెందినట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారం లేదు. ఈ దాడుల్లో ఆయతుల్లా అలీ ఖమేనీతో పాటు ఆయన భార్య, కుమార్తె, అల్లుడు, మనవడు కూడా మరణించినట్లు సమాచారం.

# జైలు నుంచి విడుదలయిన బాల్క తదితరులు

-మొదటిపేజీ తరువాయి

బాల్క సుమన్‌తో పాటు రాజారెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్ బెయిల్‌పై విడుదల య్యారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు. వాళ్లు దాడి చేస్తే.. మాపైనే రివర్స్‌లో కేసు పెట్టారని మండిపడ్డారు. ఈ ఘటనలో 22 మందిపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ పీఠం ఎలా వస్తుందని మండిపడ్డారు. ప్రజా తీర్పును మంత్రి వివేక్ గౌరవించడం లేదని విమర్శించారు. జిల్లాలోని కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో వికృత క్రీడ ప్రారంభించారని బాల్క సుమన్ అన్నారు. జైలు లోపల కూడా తమను ఇబ్బంది పెట్టారని వెల్లడించారు. నిన్న హోలీ, ఇవాళ నా కొడుకు పుట్టిన రోజు.. ఈ టైమ్‌లో నన్ను ఇంట్లో లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని తెలిపారు. అందర్నీ కలుపుకుపోయాం తప్ప.. కక్ష సాధింపు చేయలేదని స్పష్టం చేశారు. నన్ను జైలులో పెట్టారు కదా.. ఇప్పుడు కడుపు మంట తగ్గిందని అనుకుంటున్నా అని అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఇప్పటికైనా సవ్యంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# డిజిటల్ జనగణనకు తెలంగాణ సిద్ధం.. మే 11 నుంచి తొలి దశ

-మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ జనాభా గణన (జనగణన) ప్రక్రియలో భాగంగా తెలంగాణలో తొలి దశ పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు, ఇతర కట్టడాల వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, అన్ని శాఖల కార్యదర్శులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, కీలక మార్గదర్శకాలు జారీ చేశారు.ఈసారి జనగణన ప్రక్రియలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకోనుంది. దేశ చరిత్రలోనే మొదటిసారి జనాభా లెక్కలను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నేరుగా స్మార్ట్‌ఫోన్లలో వివరాలను నమోదు చేస్తారు. ఇది సమాచార సేకరణలో వేగాన్ని, కచ్చితత్వాన్ని పెంచుతుంది. అంతేకాకుండా, పౌరులు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేందుకు "సెల్ఫ్-ఎన్యూమరేషన్" పేరిట ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు. ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మే 11కి 15 రోజుల ముందు నుంచే ప్రారంభమవుతుందని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు. క్షేత్రస్థాయిలో వివరాల సేకరణలో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని సీఎస్ స్పష్టంగా ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం భౌగోళిక సరిహద్దులను కచ్చితంగా నిర్ధారించుకోవాలని సూచించారు. మారుమూల గిరిజన తండాలు, పట్టణాల్లోని మురికివాడలతో సహా రాష్ట్రంలోని ఏ ఒక్క కట్టడాన్ని కూడా వదిలిపెట్టకుండా జాబితాలో చేర్చాలని ఆయన స్పష్టం చేశారు. ఈ బృహత్కార్యక్రమం విజయవంతం కావడానికి గణకులు, పర్యవేక్షకులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు.

# హిందూ పండగలంటే చిన్న చూపెందుకు

-మొదటిపేజీ తరువాయి

ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చినట్లుగానే హిందువుల కోసం ప్రత్యేక వేడుకలు చేసేలా కాంగ్రెస్ సర్కార్ ప్రకటన చేసేలా చూడాలని కోరారు. రంజాన్ కోసం ఇఫ్తార్ మాదిరిగా హిందువుల కోసం నవరాత్రి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లింల ఓట్ల కోసం ఇఫ్తార్ వేడుకలను చేసే నేతలకు హిందువుల ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. ముస్లింల ఓట్ల గురించి టోపీ పెట్టుకొనే రాజకీయ పార్టీలకు హిందువులు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సూచించారు.

# భిక్కనూరులో "డబుల్ స్టాండర్డ్స్"

- సామాన్యుడికి ఒక న్యాయం.. పరిశ్రమలకు మరో న్యాయమా?
- అధికారుల ద్వంద వైఖరికి నిదర్శనం
- ప్రజల అభీష్టం మేరకు కంపెనీకి నోటీసులు.. చర్యలు శూన్యం

భిక్కనూరు మార్చి 04 ( తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి )




అధికారుల తీరు చూస్తుంటే భిక్కనూరు మండలంలో చట్టాలు కేవలం సామాన్యుడికే చుట్టాలుగా మారాయా? అన్న సందేహం కలగక మానదు. ఒకవైపు పేదవాడు తన సొంత స్థలంలో ఒక గజం ఎక్కువ కడితే జేసీబీలతో విరుచుకుపడే యంత్రాంగం, మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పరిశ్రమల విషయంలో ఎందుకు 'మౌన ముద్ర' వహిస్తోందని స్థానికులు నిలదీస్తున్నారు. కోట్ల పరిశ్రమ అసలు అనుమతులు లేకముందే నిర్మాణం మొదలుపెట్టింది అంటే ఎంత మంది అధికారులతో సంప్రదింపులు జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

**అనుమతులు లేవని కూల్చివేతలు.. పరిశ్రమల వద్ద వెనకడుగు**

మండల కేంద్రంలో సామాన్య ప్రజలు ఇల్లు గానీ, చిన్నపాటి షెడ్డు గానీ నిర్మించుకుంటే, అనుమతుల పేరుతో అధికారులు హడావుడి చేయడం నిత్యకృత్యమైంది. చిన్నపాటి ఉల్లంఘనలు జరిగినా నోటీసులు ఇవ్వడం, ఆస్తులను కూల్చివేయడం వంటి చర్యలు వేగంగా సాగుతుంటాయి. కానీ, జెన్ అబ్సార్బ్షన్ వంటి భారీ పరిశ్రమల విషయంలో అదే వేగం ఏమైందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమల పట్ల అధికారులకు ఉన్న ఈ "అమితమైన ప్రేమ" వెనుక ఉన్న మర్మమేమిటని మండల వాసులు చర్చించుకుంటున్నారు.

**గ్రామాలు పోరాడుతుంటే.. పాలకవర్గం మీనమేషాలు**

ఈ పరిశ్రమ వల్ల కలిగే ఇబ్బందుల మీద చుట్టుపక్కల గ్రామాలు వీరోచితంగా పోరాడుతున్నాయి. తమ భూములు, ఆరోగ్యం కాపాడుకోవడానికి ప్రజలు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. కానీ, మండల కేంద్రంలోని పాలకవర్గం మాత్రం ఈ విషయంపై స్పందించకుండా "మీనమేషాలు" లెక్కించడం గమనార్హం. మా పరిధిలోని లేని అంశం లాగా చూస్తున్నారు అంటే వారి పైన ఎంత పెద్ద ఎత్తున ఒత్తిడి ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ప్రజాప్రతినిధుల మౌనం ఎవరి ప్రయోజనాల కోసం?**

ప్రజల ఓట్లతో గెలిచిన వారు, ప్రజల సమస్యల కంటే పరిశ్రమల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారా? అనే అనుమానం కలగక మానదు వీటన్నిటినీ చూస్తుంటే ప్రజలందరికీ వీరి పైన అసహనం పెరుగుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు.

**తిరగబడకముందే మేల్కొంటారా?**

"మేము ఒక గజం అదనంగా కడితే కూల్చేసే అధికారులు, పరిశ్రమల విషయంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారు?" అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మరియు పాలకుల ఈ పక్షపాత ధోరణిపై ప్రజల్లో రోజురోజుకీ వ్యతిరేకత తీవ్రస్థాయికి చేరుకుంది. ప్రజల కోసం పనిచేయాల్సిన పాలకవర్గాలు అధికారులు ఒక్కటై ఇప్పుడు పరిశ్రమలకు వంద పడటం చూస్తుంటే పలు రకాల అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజల ఓపిక నశించకముందే, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో ఈ అసహనం ప్రజా ఉద్యమంగా మారి, పాలకులకు గుణపాఠం చెప్పడం ఖాయమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, భిక్కనూరు మండల కేంద్రంలో సాగుతున్న ఈ ఏకపక్ష ధోరణిని అరికట్టాలని, అందరికీ సమానమైన న్యాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎస్వి ఫంక్షన్ హాల్ వివాదం ఏమ్మెల్యే వద్దకు





- డీఎల్‌పీవోతో నేరుగా మాట్లాడి హెచ్చరిక

భిక్కనూరు మార్చి 04 ( తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి )

భిక్కనూరు గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఎస్వి ఫంక్షన్ హాల్ వివాదం తాజాగా ఏమ్మెల్యే దృష్టికి చేరింది. ఈ నేపథ్యంలో ఏమ్మెల్యే నేరుగా జిల్లా స్థాయి పంచాయతీ అధికారితో (డీఎల్‌పీవో) ఫోన్‌లో మాట్లాడి సమస్యపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆదాయానికి ఎటువంటి గండిపడకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఏమ్మెల్యే అధికారులను తీవ్రంగా హెచ్చరించినట్లు సమాచారం. అక్రమ కట్టడాల విషయంలో చట్టానికి లోబడి పనిచేయాలని, ఎవరైనా ఎంతటి ప్రభావం చూపించినా నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇటీవల కొన్ని రోజులుగా ఈ ఎస్వి ఫంక్షన్ హాల్‌కు సంబంధించిన వివాదం జిల్లా స్థాయి రాజకీయ నాయకుల అండతో పక్కనపడిపోయిందనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై అధికారుల చర్యలు ఆలస్యం కావడం పట్ల గ్రామస్థులు కూడా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆదాయానికి సంబంధం ఉన్న అంశం కావడంతో దీనిపై తక్షణమే స్పష్టత తీసుకురావాలని ఏమ్మెల్యే సూచించినట్లు సమాచారం. అక్రమ కట్టడాల విషయంలో అధికారులు ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు? జిల్లా నాయకుల ప్రభావం వల్లే ఈ వ్యవహారం ఆలస్యం అవుతుందా? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చకు దారితీస్తున్నాయి. ఇకపై చట్టబద్ధంగా పరిశీలించి సమస్యకు త్వరగా పరిష్కారం చూపాలని ఏమ్మెల్యే అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై అధికారుల తదుపరి చర్యలు ఎలా ఉండబోతాయో స్థానికంగా ఆసక్తి నెలకొంది.

# బోయినపల్లి కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులతో కలిసి.. భోజనం చేసి...
- కేజీబీవీ విద్యార్థులతో భోజనం చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 04, తెలంగాణ పత్రిక



బోయినపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ను కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, వంట గది, బియ్యం, పప్పులు, గుడ్లు ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయం కావడంతో మెనూ పరిశీలించి.. కలెక్టర్ ప్లేట్ తీసుకొని భోజనం తీసుకుని విద్యార్థులతో కలిసి కింద కూర్చొని తిన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని ఆరా తీశారు. ఈ రోజు తింటున్న ఆహారంలో విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేడ్స్ ఏమి ఉన్నాయో ప్రశ్నించారు? రోజూ ఎంత పరిమాణంలో తీసుకోవాలి.. విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని ప్రశ్నించారు? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం విద్యాలయం పై అంతస్తులో నిర్మిస్తున్న గదులు, టాయిలెట్లు ఇతర పనులపై ఉపాధ్యాయుల నుంచి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. పదో తరగతి, ఇతర తరగతుల విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్ కు సంబంధించి అన్ని పాఠాలు చదవాలి.. రాయాలి అని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలని పిలుపు ఇచ్చారు. ఉద్యోగం లేదా వృత్తిలో స్థిరపడిన తర్వాత మిగతా విషయాలు ఆలోచించాలని దిశానిర్దేశం చేశారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఏమ్మెల్యే కె.వి.ఆర్

భిక్కనూరు మార్చి 04 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)



భిక్కనూరు పట్టణ కేంద్రంలో గల రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీకి స్థానిక శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొని మండలంలోని లబ్ధిదారులకు 57 చెక్కులు పంపిణీ చేశారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెవిఆర్ మాట్లాడుతూ పేదింటి ఆడపిల్ల పెళ్లికి ప్రభుత్వం ఇస్తున్నటువంటి కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ వంటి పథకం,పేదింటి వారికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో భిక్కనూరు గ్రామ సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్,మండల రెవెన్యూ అధికారి సునీత, ఆర్,ఐ.బాలయ్య,మండల పరిషత్ సూపర్డెంట్ రవీందర్ కుమార్,భిక్కనూరు గ్రామ పంచాయతీ కార్యనిర్వహణ అధికారి మహేష్ కుమార్ గౌడ్,గ్రామ పాలన అధికారులు కాశీరాం,రమేష్ ,బిజెపి మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్, ఉపాధ్యక్షులు అరిగె నర్సింలు,బేతి రాజు,పొగుడ శ్రీనివాస్ వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పేద ప్రజల పక్షాన పోరాడిన నాయకుడు కామ్రేడ్ బొజ్జ భూమాగౌడ్.



కోటగిరి తెలంగాణ పత్రిక మార్చ్ 4.

కోటగిరి మండల కేంద్రంలో సిపిఐ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో కామ్రేడ్ బొజ్జ భూమాగౌడ్ 5వ.వర్ధంతి ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ సిపిఐ మండల కార్యదర్శి ఏ. విట్టల్ గౌడ్ మాట్లాడుతూ..... పేద ప్రజల కోసం కల్లుగీత కార్మికుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు కామ్రేడ్ బొజ్జ భూమాగౌడ్ వర్ని మండలం మోస్రా గ్రామస్తులైన భూమాగౌడ్ చుట్టుపక్కల గ్రామాలలో పేదలకు భూముల కోసం ఇళ్లస్థలాల కోసం నిరంతరం కృషి చేశారు. చింతకుంట గోవూరు తిమ్మాపూర్ మోస్రా గ్రామాలలో నిరుపేదలకు సాగు భూములు ఇళ్ల పట్టాలు ఇప్పిచ్చిన మహా నాయకుడన్నారు. వర్ని మండల సిపిఐ కార్యదర్శిగా తెలంగాణ రాష్ట్ర గీతా పనివార సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. కల్లుగీత కార్మికుల కుటుంబాలకు టి ఎఫ్ టి లైసెన్సులు కోసం గీత కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడిన మహనీయుడు భూమాగౌడ్ ఆయన ఆశయ సాధనకై కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నల్లగంగాధర్ రాజు గుడాల రాములు గణేష్ సాకలి రాజు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్ ప్రాజెక్ట్ నీటి విడుదల

- ఏఈ సత్యనారాయణ వెల్లడి



కోటగిరి తెలంగాణ పత్రిక మార్చ్ 4.

కోటగిరి ఉమ్మడి మండలాల ప్రజలకు మరియు రైతులు అప్రమత్తంగా ఉండాలని కోటగిరి ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి యాసంగి పంటకు సాగునీటి అవసరాల కోసం ప్రధాన కాలువ ద్వారా 4వ. విడతలో భాగంగా, 1200 క్యూసెక్స్ నీటిని బుధవారం నాడు మధ్యాహ్నం 12:30గంటలకి విడుదల చేయడం జరుగుతుందన్నారు. కాలువల పరిసర ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు, రైతులు, పశుపాలకులు అప్రమత్తంగా ఉండాలని, కాలువలోకి లేదా కాలువ ఒడ్డుల సమీపానికి వెళ్లవద్దని సూచించడమైనది. ప్రజల భద్రత దృష్ట్యా అందరూ సహకరించాలని నీటిపారుదల శాఖ నిజాంసాగర్ ప్రాజెక్టు అధికారులు కోటగిరి ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ కోరారు.

## పదవ తరగతి విద్యార్థులకు 256 ప్యాడ్లు పెన్నుల పంపిణీ

- కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో....



కోటగిరి తెలంగాణ పత్రిక మార్చ్ 4.

కోటగిరి మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాలలు కోటగిరి ఎత్తోండ కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, మైనార్టీ రెసిడెన్షియల్ కోటగిరిలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు 256 అట్టలు పెన్నులు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెన్నులు పంపిణీ చేసినట్లు మండల బిజెపి అధ్యక్షుడు వేముల నవీన్ తెలిపారు. కోనేరు చారిటబుల్ ట్రస్ట్ అధినేత కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పేద విద్యార్థిని విద్యార్థులకు అండగా నిలిచేందుకు వారు పరీక్షలు మరింత ఉత్తేజంతో రాస్తూ మంచి ఫలితాలను సాధించి తల్లిదండ్రుల కోరికలను నెరవేర్చాలని వారు కోరారు భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి మంచి స్థాయిలో ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు మండల విద్యాభివృద్ధి అధికారి నాందేళ్ళ శ్రీనివాస రావు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రిటైర్డ్ ఉపాధ్యాయురాలు పార్వతి మండల బిజెపి అధ్యక్షులు ఏముల నవీన్ మండల సీనియర్ నాయకులు పుల్లెల మోహన్ రావు , కోనేరు సాయి తరుణ్ తేజ, కులకర్ణి శ్యామల మండల సీనియర్ నాయకులు శ్యామ్, నాగేల్లి శ్రీనివాస్, మామిడి సాయిలు,విలాస్,గుంజరి జగదీష్,నగేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- అర్హత గల ప్రతి విద్యార్థి ఉన్నత విద్య కొనసాగించాలి.



పెద్దపల్లి, ప్రతినిధి మార్చి 04 ( తెలంగాణ పత్రిక )

ఇంటర్ ఉత్తీర్ణత సాధించి అర్హత గల ప్రతి విద్యార్థి ఉన్నత విద్య కొనసాగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దకాల్వలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల పోస్టర్ ను ఆవిష్కరించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు సమీప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో నాణ్యమైన విద్య అందించే అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ వంటి పథకాలు, నైపుణ్యాల ఆధారిత కోర్సులు వంటి సౌకర్యాలు విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి అర్హత గల విద్యార్థి ఉన్నత విద్యలో కొనసాగాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాల ప్రవేశాల ప్రచార కార్యక్రమాలు కౌన్సిలింగ్ సమావేశాలు, ప్రచార పత్రాల పంపిణీ కొనసాగించాలని కలెక్టర్ ప్రిన్సిపల్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.లక్ష్మి నర్సయ్య అధ్యాపకులు డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ మారుతి, మురళి, డాక్టర్ షకుర్, డాక్టర్ నారాయణ , తదితరులు పాల్గొన్నారు.

## గర్శకుర్తిలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- పూజల్లో పాల్గొన్న టి.ఎల్ తూడి లచ్చన్న



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 04, తెలంగాణ పత్రిక

గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టి.ఎల్ యువసేన అధ్యక్షులు, సామాజిక వేత్త తూడి లచ్చన్న విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహాయంగా 20,016/- విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు, యువకులు మరియు టి.ఎల్ యువసేన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ రామ క్షేత్రం సందర్శించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్ తీన్మార్ మల్లన్న



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 04, తెలంగాణ పత్రిక

తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బుధవారం సిరిసిల్ల జిల్లా రామోజీపేటలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ రామ క్షేత్రంను భక్తిశ్రద్ధలతో సందర్శించారు. ఆలయానికి చేరుకున్న మల్లన్న ఆలయ అర్చకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రైతులు, కార్మికులు, యువతకు అభివృద్ధి అవకాశాలు కలగాలని దేవుడిని ప్రార్థించారు.ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ ఆధ్యాత్మికత సమాజానికి మార్గదర్శక శక్తిగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ ధర్మం, నీతి మార్గంలో నడవాలని సూచించారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు

- విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 4

గణితశాస్త్రం పేపర్-IIA, వృక్షశాస్త్రం పేపర్-II, రాజకీయ శాస్త్రం పేపర్-II పరీక్షలు జిల్లాలోని 37 కేంద్రాల్లో నిర్వహించబడ్డాయి. మొత్తం 8,805 మంది విద్యార్థులకు గాను 8,584 మంది హాజరై, 221 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

# పరిశ్రమల రద్దు తీర్మానం ఏమ్మెల్యేకు అందజేసిన పెద్దమల్లారెడ్డి పాలకవర్గం

- సానుకూలంగా స్పందించిన ఏమ్మెల్యే కేవిఆర్

భిక్కనూరు మార్చి 04 ( తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి )

భిక్కనూరు మండల పరిధిలో ప్రతిపాదిత పరిశ్రమల ఏర్పాటుపై పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామం పరిసరాలలో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేయకూడదని డిమాండ్ చేస్తూ పెద్దమల్లారెడ్డి గ్రామ సర్పంచ్ కోదూరి సాయగౌడ్,ఉప సర్పంచ్ పట్లూరి చైతన్య కొండల్ రెడ్డి పాలకవర్గం గ్రామ ప్రజలు కలిసి తీర్మానంచేసిన కాపీని స్థానిక ఎమ్మెల్యేకు అందజేశారు, కొద్ది రోజుల క్రితం ఇదే అంశంపై గ్రామ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ అభ్యంతరాలను తెలియజేశారు. తాజాగా ఎమ్మెల్యేను కలిసి గ్రామ ప్రజల అభిప్రాయాన్ని వివరించి, గ్రామ పరిధిలో ఎటువంటి రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామ ప్రజల ఆందోళనలను సానుకూలంగా స్వీకరించి సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. పెద్దమల్లారెడ్డి గ్రామం పరిధిలో రసాయన పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామస్తులు పోరుబాట పట్టారు. పరిసర గ్రామాలు కూడా ఈ ఉద్యమానికి మద్దతు తెలుపుతూ ముందుకు వస్తున్నాయి. పరిశ్రమల వల్ల పర్యావరణం మరియు ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, భిక్కనూరు మండల పాలకవర్గం తీరుపై గ్రామ ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పాలకవర్గం ప్రజల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా తటస్థంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం గ్రామ ప్రజలు తమ డిమాండ్ల సాధన కోసం మౌనంగా కానీ దృఢంగా పోరాటాన్ని కొనసాగిస్తుండగా, అధికారులు మరియు పాలకవర్గం పరిస్థితిని గమనిస్తూ తటస్థంగా ముందుకు



వెళుతున్నట్లు తెలుస్తోంది. ఈ సమస్యపై త్వరలోనే స్పష్టత రావాలని గ్రామ ప్రజలు ఆశిస్తున్నారు.

# బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం,తహసీల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



- తహసీల్ కార్యాలయంలో తనిఖీ
- మెరుగైన వైద్య సేవలు అందించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 04, తెలంగాణ పత్రిక

వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి.. సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు.రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి .. వారి అనారోగ్య సమస్యను తెలుసుకున్నారు. పీ హెచ్ సీ పరిధిలో కొత్తగా, ఇప్పటికే మొదలు పెట్టిన హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణాల పురోగతిపై వైద్యాధికారిని ఆరా తీశారు. వాటి పై అధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని



ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిత్యం సమయానుసారంగా అందుబాటులో ఉండాలని సూచించారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు.

**తహసీల్ కార్యాలయంలో పరిశీలన**

మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, భూ భారతి రిజిస్ట్రేషన్ గది, కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.కార్యాలయానికి వచ్చే వారికి సేవలు అందించాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి అందుబాటులో ఉండాలని ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేసారు.ఇక్కడ తహసీల్దార్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటన



- యువత ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు
- మార్చి 31 నాటికి రాఘవపూర్ లో నిర్మించిన స్త్రీ భవనాన్ని ప్రారంభించాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ప్రతినిధి మార్చి04 ( తెలంగాణ పత్రిక )

యువత ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. మంథనిలోని గంగపురి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని, గౌతమి నగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను, టాస్క్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,ప్రభుత్వ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ లో భాగంగా టీజిఐఐసి సంస్థ ఆధ్వర్యంలో గార్మెంట్ యూనిట్ల ఏర్పాటు చేసేందుకు వీలుగా 2 ఎకరాలు కేటాయించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టాస్క్ సెంటర్ ద్వారా యువత మంచి శిక్షణ అందించేందుకు వీలుగా మంథని లో సెంటర్ ఏర్పాటు చేశామని, అవసరమైన పక్షంలో మరో భవనానికి కూడా విస్తరించేందుకు అవసరమైన చర్యలు తీసు కోవాలన్నారు. అనంతరం పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలో నిర్మిస్తున్న స్త్రీ భవనం పనులను కలెక్టర్ పరిశీలించి పెండింగ్ ఉన్న చిన్న చిన్న పనులు





పూర్తిచేసి మార్చి 31 నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని ఆర్డీవో సురేష్, తహసిల్దార్ ఆరిఫోద్దీన్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ దేశం పై అమెరికా ఇజ్రాయెల్ దేశాలు చేస్తున్న యుద్ధం తక్షణం ఆపాలి సిపిఎం

తెలంగాణ పత్రిక దమ్మపేట మార్చి 4

ఈరోజు. 4--3--2026. నాడు. సిపిఎం పార్టీ దమ్మపేట మండల కమిటీ మరియు శాఖ కార్యదర్శుల సంయుక్త సమావేశం పార్టీ మండల కార్యాలయం సుందరయ్య భవనంలో మండల కమిటీ సభ్యులు కొలిక్కి పోగు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మొరంపూడి శ్రీనివాసరావు మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నియంత్రత్వాన్ని విడనాడాలి. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుల ఆంక్షలు తలొగ్గారు అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ ఇరాక్ వెనిజులా తదితర చిన్న చిన్న దేశాలపై ప్రధానంగా ముడి సమురు నిల్వలున్న దేశాలపై అమెరికా పెత్తనం అధికమైంది ఆయా దేశాల్లో ఉన్న ఖనిజ సంపాదన సహజ సంపాదన దోచుకునేందుకు అమెరికా అధ్యక్షులు ట్రంపు అప్రాజాసోమికంగా వ్యవహరించుతున్నారు అని ట్రంప్ విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు ఆటవిక రాజ్యాన్ని తప్పించేలాగా అమెరికా అధ్యక్షులు ట్రంప్ హింసకాండ కొనసాగించటం ప్రజాస్వామ్యక వాదులు అందరూ ఖండించాలన్నారు. కేంద్రంలోని మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించుచు పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు మోసపూరిత హామీలు ఎన్నో ఇచ్చి హామీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కాలం గడుపుతుందని ప్రజలకు ఇచ్చిన



వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు రావుల శోభన్ బాబు మొరంపూడి కేశవరావు ఆబోతు చెన్నకేశవులు కొప్పుల శ్రీనివాసరావు శాఖా కార్యదర్శులు సిహెచ్ బ్రహ్మయ్య నారపోగు అనిల్ కుమార్ ఎస్ కే జాన్ పాషా మోటేపల్లి ధర్మయ్య మళ్ళా సత్యం పి లక్ష్మణరావు సోయం భీముడు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ప్రజాప్రతినిధులు పారదర్శకంగా నిబద్ధతతో పని చేయాలి ఎమ్మెల్యే జారె

తెలంగాణ పత్రిక దమ్మపేట మార్చి 4

దమ్మపేట మండల కేంద్రంలో మల్లారం రైతు వేదిక నందు నూతనంగా గ్రామపంచాయతీ ఎన్నికలలో వార్డు సభ్యులుగా గెలుపొందిన అభ్యర్థులకు మండల స్థాయిలో మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడు తున్నాయి ఈ శిక్షణ కార్యక్రమాల మొదటి విడత తరగతులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ వ్యవస్థ గ్రామాల అభివృద్ధికి మొదటి మెట్టు అని పేర్కొన్నారు అభివృద్ధి పరిశుభ్రత తాగునీరు విద్య ఆరోగ్యం వంటి అంశాలలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రజాప్రతినిధి కర్తవ్యమని గ్రామాల్లో పారదర్శకంగా నిబద్ధతతో పని చేయాలని సూచించారు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయాలని గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా సమన్వయంతో పరిష్కరించాలని పిలుపునిచ్చారు. మూడు విడతలుగా నిర్వహించనున్న ఈ శిక్షణలో గ్రామపాలన విధానం నిధుల వినియోగం అభివృద్ధి పనుల పర్యవేక్షణ గ్రామసభల నిర్వహణ వంటి అంశాలపై



పూర్తి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి మండల ప్రత్యేక అధికారి రవికుమార్ ట్రైనింగ్ ఆఫీసర్లు రాజేశ్వర రావు రామ్మూర్తి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పగడాల రమాదేవి చిన్నశెట్టి యుగంధర్ పగడాల రాంబాబు పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా, మండల స్థాయిలో క్రియా శీలక శిక్షణ తరగతులు నిర్వహించాలి

**- మాజీ జెడ్పిటిసి సభ్యుడు తీగల తిరుమల్ గౌడ్**

కామారెడ్డి ,మార్చి 4, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం జిల్లా అధ్యక్షులకు నిర్వహించిన మాదిరిగానే మండల, జిల్లా స్థాయి కాంగ్రెస్ కార్యవర్గ ప్రతినిధులకు క్రియాశీలక శిక్షణా తరగతులు నిర్వహించాలని కామారెడ్డి జిల్లాదోమకొండ మాజీ జెడ్పిటిసి సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తీగల తిరుమల్ గౌడ్ కోరారు. ఆయన బుధవారం దోమకొండ లో విలేకరులతో మాట్లాడుతూ... అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గే, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ సూచన మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు పది రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించడం పార్టీకి శుభ సూచకమని అన్నారు. శిక్షణ తరగతులలో లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ శిక్షణ తరగతులకు వచ్చి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణ, ప్రజలతో మమేకం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను అవగాహన కల్పించడం చారిత్రాత్మక విప్లవమని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శిక్షణ తరగతులకు రాహుల్ గాంధీని స్వాగతించి, జిల్లా కాంగ్రెస్ నాయకత్వంలో కొత్త ఉత్సాహాన్ని నింపారని అన్నారు. పది రోజుల శిక్షణతో డిసిసి అధ్యక్షులలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు, రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా



చాటడానికి ఎంతో ఉపయోగపడిందన్నారు. 1998వ సంవత్సరంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో లక్ష్మీ కళ్యాణం మండపంలో జిల్లా, మండల కార్యవర్గ ప్రతిదులకు పార్టీ అధిష్టానము శిక్షణ తరగతులు నిర్వహించిందని గుర్తు చేశారు. ఆ శిక్షణ అప్పటి నాయకులు, కార్యకర్తలకు పార్టీ పై అంకితభావంతో పనిచేయటానికి ఉపయోగ పడిందన్నారు. జిల్లా, మండల స్థాయిలోనూ కార్యవర్గ ప్రతినిధులకు, క్రియాశీలక కార్యకర్తలకు ఇదే మాదిరిగా ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అనంతరెడ్డి, దోమకొండ కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాం మధు పాల్గొన్నారు.

# కాలువ ఆగే ప్రసక్తే లేదు.. రైతుల కన్నీళ్లు తుడిచే బాధ్యత నాది..!

**- నేరుగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఫోన్ కాల్...**

**-సిరిసిల్ల రైతులకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న భరోసా**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 04, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో పెద్దలింగాపూర్ గ్రామంతో పాటు 12 గ్రామాల రైతుల సాగునీటి కల ఏళ్ల తరబడి అసంపూర్తిగానే మిగిలిపోయింది. కాళేశ్వరం ప్యాకేజీ 11/6లో భాగంగా జరుగుతున్న కాలువ పనులు, కేవలం ఒక్క కిలోమీటర్నర మేర ఆగిపోవడంతో పదిహేను గ్రామాల అన్నదాతల ఆశలు అడియాశలయ్యాయి. ఎండిపోతున్న పొలాలను చూసి, కన్నీరు మున్నీరవుతున్న రైతుల గొంతుకగా నిలిచేందుకు టీఆర్పీ పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్వయంగా రంగంలోకి దిగారు.పెద్దలింగాపూర్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించిన మల్లన్న, నిలిచిపోయిన కాలువ పనులను పరిశీలించారు. అలాగే కాలువ పనులు పూర్తి చేయాలని 12 గ్రామాల రైతులు ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని నేడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సందర్శించారు.ఈ సందర్భంగా రైతులు ఏళ్ల తలబడి ఎదుర్కొంటున్న సమస్యలను మల్లన్న విన్నవించుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, అన్నదాతల కన్నీళ్లకు వెల కట్టలేం. కేవలం ఒక్క కిలోమీటర్నర పనులు ఆపి, 12 గ్రామాల రైతులను ఇబ్బంది పెట్టడం శోచనీయం అన్నారు. ఈ కాలువను పూర్తి చేయించి, రైతులకు నీరందించే బాధ్యత నేను తీసుకుంటున్నాను" అని ఘంటాపథంగా చెప్పారు.వెంటనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి మరియు ప్రిన్సిపల్ సెక్రటరీ కి ఫోన్ కాల్ చేసి రైతుల సమస్యను వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే అధికారులతో మాట్లాడి కాలువ పనులు పూర్తి చేస్తాం అని హామీ ఇచ్చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పనుల్లో జాప్యం చేస్తూ రైతుల సాగునీటి హక్కును కాలరాస్తే సహించేది లేదని అధికారులను ఫోన్ లో హెచ్చరించారు .ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యపై




మల్లన్న స్పందించిన తీరు పట్ల పెద్దలింగాపూర్ మరియు చుట్టుపక్కల 12 గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు.మాట ఇవ్వడమే కాదు, మడమ తిప్పకుండా పనులు పూర్తి చేయిస్తా అని మల్లన్న ఇచ్చిన భరోసాతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. మరి కొద్ది రోజుల్లోనే ఈ ఒక్క కిలోమీటర్నర కాలువ పనులు పూర్తై 12 గ్రామాలకు చెందిన దాదాపు 10వేల ఎకరాల పొలాలు సస్యశ్యామలం అవుతాయని అంతా భావిస్తున్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్,రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్,వుమెన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్,గీస మధు యాదవ్,జిల్లా అధ్యక్షులు మల్లేశం,నాయకులు ,సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బిక్షపతి తో పాటు జిల్లా నాయకులు ,కార్యకర్తలు మరియు గ్రామాల రైతులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

# కోటగిరిలో హోలీ సంబరాలు



కోటగిరి తెలంగాణ పత్రిక మార్చి 4.

కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల తాజా మాజీ ప్రజా ప్రతినిధులు హోలీని ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాలలో హోలీ సంబరాలు నూతన సర్పంచులు మాజీ ప్రజాప్రతినిధులు యువకులు మహిళలు వివిధ యువజన సంఘాల యువకులు హోలీ పండగ సంబరాల్లో పాల్గొని రంగులను ఒకరిపై ఒకరు చిమ్ముకొని హోలీని ఘనంగా జరుపుకున్నారు .ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్ మాట్లాడుతూ... మండల ప్రజా ప్రతినిధులకు అధికారులకు గ్రామ ప్రజలకు యువకులకు మహిళలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ప్రజలు రైతులు పలు గ్రామాల రైతులు యువకులు అందరూ సుఖ సంతోషాలతో హోలీ పండుగను ఆనంద ఉత్సవాల్లో సంబరాలను జరుపుకోవాలన్నారు. పాడిపంటలు సమృద్ధి గా పండి రైతులు సుఖ సంతోషాలతో ఆనందంగా గడపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్ మండల మాజీ ప్రజాప్రతినిధులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి , ప్రతినిధి మార్చి- 4 ( తెలంగాణ పత్రిక )



జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం (ఎన్ఎఫ్ బి ఎస్) అర్హులైన వారు పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఓ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం లేదా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బి.పి.ఎల్ కుటుంబాలలో కుటుంబాన్ని పోషించే ప్రధాన వ్యక్తి 18 నుంచి 60 సంవత్సరాల వయసు గలవారు మరణిస్తే వారు కుటుంబానికి ఈ పథకం కింద 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. ఈ పథకానికి సంబంధించి మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇతర ఆర్థిక సహాయాలు అందకుండా ఉండాలని, అప్పుడే ఈ పథకం అమలు అవుతుందని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే జారే ను మర్యాదపూర్వకంగా కలిసిన సెక్రటరీ బండి అనంత్



తెలంగాణ పత్రిక/దమ్మపేట(మార్చి 04)దమ్మపేట

పంచాయతీ కార్యదర్శి గా బాధ్యతలు చేపట్టిన బండి అనంత్ కుమార్ బుధవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ను గండుగులపల్లి గ్రామంలో గల వారి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా దమ్మపేట మండల కేంద్రం మరియు మేజర్ పంచాయతీ అయిన దమ్మపేట ను మోడల్ పంచాయతీగా అభివృద్ధి చేయాలని సెక్రటరీ కి ఎమ్మెల్యే సూచించారు. ప్రధాన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబులతో అన్నారు.

# సర్పంచ్ జన్మదిన సందర్భంగా సన్మానించిన మాజీ జడ్పిటిసి

కామారెడ్డి, మార్చి 4,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా దోమకొండ సర్పంచ్ ఐరేని నర్సయ్య జన్మదినం సందర్భంగా బుధవారం దోమకొండ మాజీ జెడ్పిటిసి సభ్యుడు తీగల తిరుమల్ గౌడ్ సన్మానించారు. దోమకొండ మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా నాయకులు తాటిపల్లి శ్రీకాంత్, పట్టణ అధ్యక్షులు సీతారాం మధు, సంజీవరెడ్డి, అంకం బాలరాజ్, కమ్మరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఆర్ సీ చైర్మెన్ కు స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 04, తెలంగాణ పత్రిక

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో తెలంగాణ ఈ ఆర్ సీ బుధవారం నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరైన తెలంగాణ ఈ ఆర్ సీ చైర్మెన్ డాక్టర్ జస్టిస్ డీ నాగార్జున, కే రఘు, ఈ ఆర్ సీ టెక్నికల్ విభాగం సభ్యుడు, సీ హెచ్ శ్రీనివాస్ రావు, ఈ ఆర్ సీ ఫైనాన్స్ విభాగం సభ్యులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చం అందజేసారు. కార్యక్రమంలో సెస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పలు శాఖల మండల అధికారులతో సమావేశం.



కోటగిరి తెలంగాణ పత్రిక మార్చి 4.

కోటగిరి మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్ రెడ్డి ఎంపీడీవో విష్ణు వివిధ మండల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులతో మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.... విద్యుత్ వ్యవసాయం ఆర్డబ్ల్యూఎస్ నీటి పారుదల వైద్య ఆరోగ్య అంశాలపై సమీక్షించారు. ఎండాకాలంలో గ్రామాలలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండల అధికారులు గ్రామస్థాయి అధికారులు గ్రామాలలోని ప్రజల సమస్యలను పరిష్కరించుటకు కృషి చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీలోని నీటి విద్యుత్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమస్యలను పరిష్కరించుటకు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్ రెడ్డి ఎంపీడీవో విష్ణు తహసిల్దార్ గంగాధర్ విద్యుత్ ఏఈ బుజ్జిబాబు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ధనరాజ్ అగ్రికల్చర్ ఆఫీసర్ రాజు ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి టెంపుల్ లో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు

- అయ్యప్ప సేవా సంఘం ట్రస్ట్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లకి ఘన సన్మానం





జగిత్యాల పట్టణం, మార్చి 04, (తెలంగాణ పత్రిక ):

జగిత్యాల పట్టణంలోని బుధవారం అయ్యప్ప స్వామి టెంపుల్ లో మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప సేవా సంఘం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్, సమీండ్ల వాణి శ్రీనివాస్ ని అలాగే పట్టణ వార్డ్ కౌన్సిలర్లను ట్రస్ట్ సభ్యులు వేద బ్రాహ్మణుల ఆశీర్వచనాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి ఆశీస్సులతో జగిత్యాల ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, జగిత్యాల మున్సిపాలిటీ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అయ్యప్ప సేవా సంఘం ట్రస్ట్ సభ్యులు శ్రీ బండారు లక్ష్మీనారాయణ గురుస్వామి, మానాల కిషన్ గురుస్వామి, శ్రీ చిక్కుల భూమయ్య, శ్రీ మార కైలాసం, శ్రీ నీలం దశరథ్ రెడ్డి గురుస్వామి, మగ్గిపల్లి శ్రీరాములు, వులుసే శ్రీనివాసరావు, పల్లెర్ల రాజు, దీటి సతీష్, బెజ్జంకి రవీందర్ రావు, అల్లాల ఆనంద్ రావు, పాముపట్టి రవీందర్, పృథ్వీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రీపోలింగ్‌కు డిమాండ్ మూడు ఓట్ల తేడాతో ఓటమి

- జిల్లా కోర్టును ఆశ్రయించిన రంగా మాధవి

కామారెడ్డి, మార్చి 4,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో 38వ వార్డులో దొంగ ఓట్లు నమోదయ్యాయని, మొత్తం 200 వరకు అక్రమ ఓట్లు పడ్డాయని కాంగ్రెస్ పార్టీ 38 వార్డు అభ్యర్థి రంగా మాధవి ఆరోపించారు. కేవలం మూడు ఓట్ల మెజారిటీతో ఓడిపోవడం బాధాకరమని పేర్కొంటూ 38వ వార్డులో రీపోలింగ్ నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సమీప అభ్యర్థి ఇప్ప ఉమారాణి మూడు ఓట్ల తేడాతో గెలుపొందారని తెలిపారు. మొత్తం 1149 ఓట్లు పోలవ్వగా అందులో 200 వరకు దొంగ ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. తమ కాలనీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ప్రముఖులు పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వకుండా స్వతంత్ర అభ్యర్థికి సపోర్ట్ చేశారని, ఓటర్లకు ఫోన్ చేసి కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని సూచించారని పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు రెండు చోట్ల ఓట్లు వేశారని ఆరోపిస్తూ, రాజంపేట ఉప సర్పంచ్ ఇమ్రాన్ అలీతో పాటు ఒక ప్రభుత్వ హిందీ ఉపాధ్యాయుడు రెండు చోట్ల ఓటు వేశారని చెప్పారు. ఫారూఖ్ అలీ అనే వ్యక్తి 38 వ మరియు 34వ వార్డుల్లో ఓటు వేశారని తెలిపారు. దొంగ ఓట్లు వేసిన వారిలో రాజకీయ నాయకులు, ఉద్యోగులు, మత పెద్దలు ఉన్నారని ఆరోపించిన ఆమె, ఎన్నికల సమయంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఓటర్ ఐడీ కార్డు, ఓటరు జాబితాలో పేరు ఉందని అధికారులు చెప్పి నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఈ విషయమై ఈ నెల 3 న కామారెడ్డి జిల్లా కోర్టులో కేసు దాఖలు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 6 న విచారణ జరగనుందని, న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్ప ఉమారాణి తరపున 119వ బూత్ ఏజెంట్‌గా పని చేసిన మోచి సురేందర్ మాట్లాడుతూ, రాజంపేట గ్రామస్తులు వచ్చి ఓట్లు వేశారని ఆరోపించారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా “హెల్త్ మిషన్100డేస్ ప్రారంభం

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హెల్త్ మిషన్ 100 డేస్

కొత్తగూడెం ఆర్సి మార్చ్ 04 (తెలంగాణ పత్రిక)



కార్యక్రమాన్ని 04-03-2026 నుండి 09-06-2026 వరకు 100 రోజులపాటు నిర్వహించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ అంకిత్,జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆధ్వర్యంలో దశల వారీగా అమలు చేయబడనుంది.మొదటి దశ(04-03-202631-03-2026)లో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలులో శిశు వైద్యుడు,స్త్రీ రోగ నిపుణుడు, సాధారణ వైద్యుడు,దంత వైద్యుడు,కంటి నిపుణుడు,ఎముకల వైద్య నిపుణుడు సేవలు అందుబాటులో ఉంటాయి.అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను ఆర్‌బిఎస్‌కే బృందాలు సందర్శించి విద్యార్థులకు స్క్రీనింగ్, కౌన్సెలింగ్ నిర్వహిస్తాయి. రెండవ దశ (01-04-2026 15-04-2026)లో ఆసాంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్, చికిత్స, రిఫరల్,ఫాలోఅప్ చర్యలు చేపడతారు.క్యాన్సర్ రిజిస్ట్రీ ఏర్పాటు చేసి డీసీసీసీ ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్,చికిత్స కార్యక్రమాలు నిర్వహిస్తారు. మూడవ దశ (16-04-202615-05-2026)లో సంక్రమణ వ్యాధుల స్క్రీనింగ్,ప్రజారోగ్య సిద్ధత చర్యలు చేపట్టి వేసవి దృష్ట్యా హీట్ స్ట్రోక్ రూమ్‌లను ప్రారంభిస్తారు. నాలుగవ దశ(16-05-202609-06-2026)లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎనిమిది ప్రత్యేక నిపుణుల క్లినిక్‌లు ఏర్పాటు చేసి తృతీయ స్థాయి ఆసుపత్రులపై భారం తగ్గించనున్నారు.100రోజులపాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ప్రొఫైలింగ్ చేపడతారు. ఆరోగ్య కేంద్రాలకు ప్రమాణీకరణ కార్యక్రమాలు అమలు చేస్తారు.జిల్లా ప్రజలు ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ విజ్ఞప్తి చేశారు.జిల్లా ప్రజల ఆరోగ్యమే మా లక్ష్యం అని తెలిపారు.

## శ్లోక పాఠశాలకు ఉత్తమ రక్తదాన శిబిర మోటివేటర్ పురస్కారం అందజేత

- తలసేమియా వ్యాధి చిన్నారుల రక్తదాన శిబిరాలకు సహకరిస్తున్నందుకు

కామారెడ్డి, మార్చ్ 4, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్లోక పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ జలిగామ శ్రీకాంత్ కు ఉత్తమ రక్తదాన శిబిర మోటివేటర్ పురస్కారం -2026 ను ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) మరియు కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, ఐవిఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్ లు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలకు శ్లోక పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ జలిగామ శ్రీకాంత్ సహకరించడం. జరిగిందని, పాఠశాల అంటే కేవలం విద్య మాత్రమే కాదని విద్యతో పాటుగా సామాజిక సేవలో విద్యార్థులను భాగస్వాములుగా చేయడం ఎంతగానో అభినందనీయమని అన్నారు. రక్తదాన శిబిరం నిర్వహించాలంటే చాలామంది సహాయ, సహకారాలు అవసరం అవుతాయని,రక్తదాన శిబిరాలకు సహకరిస్తున్న వారందరికీ అవార్డులను అందజేయడం జరుగుతుందని అన్నారు.తల సేమియా బాధిత చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం వారి జీవితాంతం అవసరం ఉందని అలాంటి చిన్నారుల ప్రాణాలను కాపాడడానికి రాబోయే రోజుల్లో మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని అన్నారు.ఈ శిబిరాలను విజయవంతం చేయడానికి సామాజిక సేవకులు,రక్తదాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## పదేళ్ల చిన్నారి ప్రాణాల కోసం దాతల సాయం కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు

- ప్రాణాల కోసం పోరాడుతున్న పదేండ్ల సహస్ర..
- చిన్న సహాయంఉ ఒక ప్రాణానికి నూతన జీవితం
- చికిత్స కోసం రూ.30లక్షలు అత్యవసరం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 04, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల పట్టణానికి చెందిన ఒక పేద నేత కార్మికుడి కుటుంబం ప్రస్తుతం తీవ్ర విషాదంలో ఉంది. తమ పదేళ్ల కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో, ఆ బిడ్డను కాపాడుకోవడానికి దాతల సాయం కోసం ఆ తల్లిదండ్రులు ఆర్తిగా ఎదురుచూస్తున్నారు.సిరిసిల్ల పట్టణం 34వ వార్డుకు చెందిన అంబటి వేణు వృత్తిరీత్యా నేత కార్మికుడు. ఆయన భార్య బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరి కుమార్తె అంబటి సహస్ర (10) గత కొంతకాలం గా తీవ్రమైన లివర్ వ్యాధితో బాధపడుతోంది. మెరుగైన చికిత్స కోసం ఆమెను హైదరాబాద్‌లోని రెయిన్బో చిల్డ్రన్ హాస్పిటల్కు తరలించగా, వైద్యులు పరీక్షించి చిన్నారికి అత్యవసరంగా లివర్ మార్పిడి శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. ఈ శస్త్రచికిత్సకు సుమారు రూ.30 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు అంచనా వేశారు. ఇప్పటికే అప్పులు చేసి రూ.5లక్షల వరకు చికిత్స కోసం ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రోజువారీ కూలీ పనులపై ఆధారపడే ఆ కుటుంబానికి మిగిలిన మొత్తం సమకూర్చడం అసాధ్యంగా మారింది. మా కళ్లముందే బిడ్డ మంచాన పడి ఉంది. మేము ఎంతో ప్రయత్నించినా అంత పెద్ద మొత్తం సమకూర్చలేకపోతున్నాం. దయచేసి దాతలు ముందుకు వచ్చి మా బిడ్డ ప్రాణాలను కాపాడాలి” అని తండ్రి అంబటి వేణు కన్నీటి పర్యంతమై వేడుకుంటున్నారు. సహాయం చేయాలనుకునే దాతలు ఫోన్‌పే నంబర్లు 9912231674 లేదా 9676260746కు ఆర్థిక సాయం పంపించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మనసున్న వారు ముందుకు వచ్చి చిన్నారి సహస్రకు ప్రాణదానం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విద్యార్థులకు డిజిటల్ విద్య ఎంతో ఉపయోగకరం

- మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్
- జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత

జగిత్యాల, మార్చి 4, (తెలంగాణ పత్రిక ):



జగిత్యాల్ పట్టణంలోని ఓల్డ్ హై స్కూల్‌లో రోటరీ క్లబ్ మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో రీయూజబుల్ మరియు వాషబుల్ క్లాత్ సానిటరీ ప్యాడ్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ మరియు జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత హాజరై విద్యార్థినులకు కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినడం ద్వారా నేర్చుకోవడం కంటే చూసి నేర్చుకోవడం విద్యార్థులకు ఎక్కువ ప్రయోజనకరమని తెలిపారు. డిజిటల్ విద్య ద్వారా పాఠాలను స్పష్టంగా అర్థం చేసుకునే అవకాశం ఉండడంతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. అలాగే విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యలో అంతరాయం కలగకుండా ఆరోగ్య పరిరక్షణ అత్యంత ముఖ్యమని తెలిపారు. రీయూజబుల్ మరియు వాషబుల్ క్లాత్ సానిటరీ ప్యాడ్‌ల వినియోగం ఆరోగ్య రక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు ఆరు లక్షల రూపాయల విలువైన సానిటరీ ప్యాడ్ కిట్స్‌ను జగిత్యాల అర్బన్ మండల పరిధిలోని ప్రభుత్వ మరియు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న సుమారు 800 మంది విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ అరవ లక్ష్మి, మండల విద్యాధికారి చంద్రకళ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏవీఎల్ఎన్ చారి, ప్రధాన కార్యదర్శి రాజు, సభ్యులు మంచాల కృష్ణ, టీవీ సూర్యం, బొడ్ల జగదీష్, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి ఆనంద్ రావు, ప్రధాన కార్యదర్శి యల్ల అమర్నాథ్ రెడ్డి, వైద్యులు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# గుట్ట నుండి గుడి కి నాగులమ్మ

- గండోర్రె గుట్ట వద్ద నాగులమ్మ కు రెండు గంటలకు పైగా ప్రత్యేక పూజలు
- ఎర్రెట్టల గుట్ట నుండి సడాలమ్మ ను తెచ్చిన పూజారులు
- గోదావరి పుణ్య స్నానాలు ఆచరించిన పూజారులు,వడ్డెలు

మంగపేట,మార్చి,04(తెలంగాణ పత్రిక)

మంగపేట మండలం వాగొడ్డుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల లక్ష్మీ నర్సాపూర్ గ్రామంలో నాగులమ్మ జాతర రెండో రోజు బుధ వారం నాగులమ్మ ,సడాలమ్మ రాక తో జాతర ముఖ్య ఘట్టం ప్రారంభమైంది. ఉదయం 11గంటలకు నాగులమ్మ ప్రధాన పూజారి బాడిశ నాగరమేష్ ఆధ్వర్యంలో ఆదివాసీ పూజారులు వడ్డెలు సమీపంలో ఉన్న గండోర్రె గుట్ట ప్రాంతంలో సుమారు రెండు గంటలకు పైగా నాగులమ్మ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేసమయం లో ఎర్రెట్టల గుట్ట వద్దకు వెళ్ళిన పూజారులు సడాలమ్మ కు పూజలు చేసి నాగులమ్మ ను సడాలమ్మ ను అర్ధి బిడ్డల డోలు వాయిద్యాల నడుమ తీసుకు వొచ్చి,లక్ష్మి నర్సాపూర్ గ్రామం లో నాగులమ్మ కు చెందిన డాలు జెండా లతో ఎదుర్కోలు నిర్వహించారు. అనంతరం రమణక్క పేట సమీపంలో గల గోదావరి నది వద్దకు చేరుకొని పూజారులు ఏడు చెలిమలు తీసి వివిధ రకాల దళాలతో అభిషేఖాలు, పుణ్యస్నానాలు నిర్వహించారు. అనంతరం నాగులమ్మ ఆలయానికి తీసుకు వొచ్చి గద్దెల పై ప్రతిష్టించారు. రాత్రి 8 గంటలకు చుంచుపల్లి గ్రామం నుండి అమ్మ వారికి చెందిన అవిరేణి కుండలను ఆదివాసీ మహిళలు ఆలయానికి సమర్పించారు. ఆలయ ధర్మకర్త,మెనిజింగ్ ట్రస్టీ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి ,పూజ కార్యక్రమాలను పర్యవేక్షించగా పూజారులు సోడి సత్యం,కుర్సం పుల్లయ్య, కట్టం సమ్మక్క,చౌళం భవాని,మడకం సుప్రజ,పోలిశెట్టి స్వరూప,వడ్డెలు కోర్స శ్రీకాంత్ ,మూయబోయిన శివ,తుర్స చిన్నబ్బాయి,కారం రాజేష్ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కులపెద్దలు కుర్సం విష్ణుమూర్తి,మడకం రాజేశ్వర్ రావు,చౌళం వెంకటేశ్వర్లు ,కొమరం మాధవ రావు,కొమరం పాపారావు,ఇరప రామకృష్ణ,ఇందారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దేశాల దాడిని ఖండించండి

- ఎం సి పి ఐ (యు) పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న యాదవ్

పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:- మార్చి 04. (తెలంగాణ పత్రిక ప్రతినిధి):

మహబూబాబాద్ జిల్లా, శనివారం రోజున గూడూరు మండలం మచ్చర్ల గ్రామంలో, ఎంసిపిఐ (యు) ముఖ్య కార్యకర్తల సమావేశం కామ్రేడ్ ఈసం రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎం సిపిఐ (యు) పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న యాదవ్ మాట్లాడుతూ.. గత నాలుగైదు రోజులుగా ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దేశాలు సాగిస్తున్న దాడులను ఖండించాలని, ఈ దాడి వలన ఆర్థిక సంక్షోభం ఏర్పడి పేద ప్రజలు వాడుకునే నిత్యవసర వస్తువుల, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందని, ఆదేశాలలో శాంతి నెలకొల్పాలని ఎంసిపిఐ (యు) పార్టీ ఆశాభావం వ్యక్తం చేస్తుందని, దాడులలో సామాన్య ప్రజలు మృతి చెందడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేద ప్రజలు అనేక సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని నివసిస్తుంటే, వారిని బలవంతంగా కాళీ చేయించి నిలువ నీడ లేకుండా చేశారని, బాధిత కుటుంబాల కు వెంటనే ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇండ్లు కట్టించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 2025 వానకాలపు పంటలు భారీ వర్షాలు, వరదల వలన వేలాది ఎకరాలు పంట నష్టం జరిగిందని, ప్రభుత్వ అధికారులు సర్వే చేయించి నివేదికలు పంపించడం జరిగిందని కానీ, ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం నేటికీ ఇవ్వలేదని, తక్షణమే నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో బీసీ రజక కులానికి చెందిన రెండు నెలల పసిపాప మృతి కి కారకులైన బాధ్యులను శిక్షించి, మృతి చెందిన పాప కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్పూర్ పట్టణంలో, రెండు రోజులుగా ఎంసీపీఐ (యు) రెండు కమిటీల పేరుతో కొనసాగి చర్చల అనంతరం. ఉమ్మడి జాతీయ కన్వెన్షన్ జరిపి ఐక్యంగా విలీనమై ఒకే కమిటీగా ఉండుటకు నిర్ణయించారని, ఈ వెలుగు లో తెలంగాణ రాష్ట్రంలో ఐక్యంగా ఉండి ప్రజా ఉద్యమాలు నిర్మాణం చేయుట కొరకు,రాష్ట్రస్థాయి విస్తృత స్థాయి సమావేశం ఈనెల 12వ తేదీన వరంగల్ నగరంలో, రాష్ట్ర జిల్లా కమిటీ సభ్యుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, ఇట్టి సమావేశాన్ని విజయవంతం చేయవలసింది గా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎం సిపిఐ (యు) పార్టీ గూడూరు మండల కార్యదర్శి బందెల వీరస్వామి,జిల్లా మండల నాయకులు కటకం బుచ్చి రామయ్య, ఈసం వెంకటనర్సు, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



# నేరేళ్ల బాధితుల ఇంటికెళ్ళి పరామర్శించిన తీన్మార్ మల్లన్న

- 2017లో పోలీస్ దాడిపై న్యాయం చేయాలని డిమాండ్
- హామీలు ఇచ్చి మర్చిపోయిన నేతలపై బాధితుల ఆవేదన
- న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం..

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 04, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా నేరేళ్ల గ్రామంలో 2017లో జరిగిన పోలీస్ హింస ఘటనలోని బాధితులను తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నేడు వారింటికి వెళ్లి పరామర్శించారు. ఆ సమయంలో జరిగిన ఘటనలో పోలీసులు అమానుషంగా థర్డ్ డిగ్రీ ఇచ్చారని బాధితులు గుర్తుచేసుకుంటూ తమకు ఇప్పటికీ న్యాయం జరగలేదని ఏ ప్రజా ప్రతినిధి కూడా తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**2017 ఘటనపై బాధితుల వేదన..!**

2017లో ఇసుక లారీ దహనం ఘటన కేసులో నేరెళ్ల గ్రామానికి చెందిన పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని దాదాపు ఐదు రోజుల పాటు పోలీస్ స్టేషన్‌లో ఉంచి థర్డ్ డిగ్రీ పద్ధతిలో చిత్రహింసలు పెట్టినట్లు బాధితులు తెలిపారు. ఆ సమయంలో జరిగిన దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.ఐతే ఈ ఘటనను కాంగ్రెస్,బీజేపీ నేతలు రాజకీయం వాడుకొని అధికారంలోకి వచ్చారు గాని తమకు ఇప్పటి వరకు న్యాయం చేయలేదని,కారకులపై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**హామీలు ఇచ్చి అమలు చేయలేదని ఆరోపణ**

బాధితులు మాట్లాడుతూ గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి తమను కలిసి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బాధ్యులైన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోయారు.అలాగే లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ నాయకుడు బండి సంజయ్ కూడా తమకు న్యాయం జరిగే వరకు తమ పక్షాన నిలబడతానని హామీ ఇచ్చారని, కానీ ఎంపీగా గెలిచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కూడా తమకు న్యాయం చేయడం కొరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు పేర్కొన్నారు.

**ప్రభుత్వానికి మల్లన్న హెచ్చరిక**

ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నేరెండ్ల ఘటన బాధితులకు తక్షణ న్యాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ కేసులో బాధ్యులైన పోలీస్ అధికారులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.బాధితులకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి ప్రభుత్వం నుంచి సమాధానం కోరుతానని హామీ ఇచ్చారు.

**ఉద్యమం కొనసాగుతుందన్న సంకేతం**

నేరెండ్ల ఘటనపై న్యాయం జరిగే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ బాధితుల పక్షాన నిలబడుతుందని మల్లన్న స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా అన్ని వేదికలలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు



# విద్యుత్ సిబ్బందికి ఘన సన్మానం

దేవరుప్పుల, మార్చి 4 (తెలంగాణ పత్రిక):

లైన్మెన్ దివస్ సందర్భంగా మండలంలోని సింగరాజు పల్లి సెక్షన్ లో పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిని బుధవారం ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏడీఈ అనిల్ మాట్లాడుతూ విద్యుత్ భద్రతను కచ్చితంగా పాటిస్తూ, "ప్రమాద రహిత సర్కిల్" అనే లక్ష్యాన్ని సాధించడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. విద్యుత్ భద్రతను మరింత బలోపేతం చేసి ప్రమాద రహిత వాతావరణంలో నిర్మిద్దామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏ డి ఈ అనిల్, ఏఈ నర్సింహులు, ఎస్ ఎల్ ఐ, ఎల్ ఐ, ఎల్ ఎం, ఏ ఎ ఎల్ ఎం, జేఎల్ఎం, కట్టర్స్ తదితరులు పాల్గొన్నారు.



# డ్వాక్రా భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్ వివేక్.



పోతంగల్ తెలంగాణ పత్రిక మార్చి 4.

పోతంగల్ మండలంలోని జల్లపల్లి అభాది గ్రామంలో డ్వాక్రా మహిళ భవనం కోసం గ్రామ సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ డ్వాక్రా మహిళలు కలిసి భూమి పూజ చేశారు. ఈ భవనం ఎన్ ఆర్ జి ఎస్ నిధుల ద్వారా నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. నూతన సర్పంచులు గ్రామ పంచాయతీల పాలకవర్గ సభ్యులు ఎన్నిక కావడంతో వారు గ్రామాల అభివృద్ధి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తూ మండలాలను గ్రామాలను అభివృద్ధి పరచుటకు కృషి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ శాఖల భవనాల కొరకు నిధులను మంజూరు చేయడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ వివేక్ తెలిపారు. జల్లాపల్లి అభాది లో పది లక్షల రూపాయలతో డ్వాక్రా మహిళా భవన నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ భవనం భూమి పూజ సందర్భంగా సర్పంచ్ వివేక్ మాట్లాడుతూ.... రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డికి మా గ్రామ ప్రజల తరఫున గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల తరఫున ప్రత్యేక కృతజ్ఞత ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఖాజాగౌసుదిన్ డ్వాక్రా మహిళలు అశ్విని యాస్మిన్ బేగం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ధనరాజ్ మతిన్ మైనార్టీ మాజీ కోఆప్షన్ మెంబర్ వాల్యాయూద్ధిన్ బిక్య నాయక్ గ్రామ సోషల్ మీడియా కన్వీనర్ మమ్మద్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఘనంగా హోలీ పండుగ



ముధోల్:04మార్చ్(తెలంగాణ పత్రిక)

మండలంలోని విట్టోలి, ముద్గల్,మచ్కల్,చించాల తోపాటు తదితర గ్రామాల్లో బుధవారం ప్రజలు హోలీ పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఒకరినొకరు చిన్న, పెద్ద తేడా లేకుండా రంగులను ఒకరి పైన ఒకరు చల్లుకున్నారు.ఈ సందర్భంగా విట్టోలి సర్పంచ్ రుచిత -దిగంబర్ ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్‌ను కలిసి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగాను వాట్సప్, ఫేస్ బుక్ తోపాటు ఫోన్ ల ద్వారా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# మెదక్ చౌరస్తాలో గాంధీ విగ్రహానికి అవమానం

- దుండగుల పై కఠిన చర్యలకు బిఆర్ఎస్ డిమాండ్

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) మార్చి 4



మెదక్ పట్టణంలోని చౌరస్తాలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు అవమానపరిచిన ఘటన స్థానికంగా తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. ఈ ఘటనపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఖండిస్తూ దుండగులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు మామిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ, మహాత్మ గాంధీ అహింసా సిద్ధాంతంతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడని పేర్కొన్నారు. అలాంటి మహాత్ముడి విగ్రహాన్ని అవమాన పరచడం భారత జాతికి అవమానమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం నిరంతరం పోరాడిన గాంధీజీని అవమానపరిచిన గూండాలను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, వారిపై కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఘటనపై స్థానిక ప్రజలు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, దుండగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# విద్యుత్ షాక్ తో రైతు మృతి

లక్ష్మణ్ చందా మండల్ రిపోర్టర్ తెలంగాణ పత్రిక మార్చి 4

నిర్మల్ జిల్లా లక్ష్మణ్ చందా మండలంలోని నర్సాపూర్ డబ్ల్యూ గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి రవి రెడ్డి రైతు మృతి చెందాడు మృతుడి వయసు 45 సంవత్సరాలు ప్రొద్దున మక్కా తోటలోకి వెళ్లిన రవి అనే రైతు ఇంటికి తిరిగి రాణి ఎడల అతని యొక్క కుమారుడు తోటలోకి వెళ్లి చూడగానే విద్యుత్ షాక్ తగిలి మరణించినట్లు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు ఇచ్చిన అనంతర మండలం పిఎస్ కు సమాచారం ఇవ్వగానే లక్ష్మణ్ చందా ఎస్సై శ్రావణి సంఘట స్థలానికి వచ్చారు ఎస్సై శ్రావణి తెలిపిన వివరాల ప్రకారం విద్యుత్ షాక్ ప్రమాదవశాత్తు తగిలి మరణించడం జరిగిందని తెలిపారు మృతుడి కుటుంబ సభ్యుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణి తెలిపారు వీరి వెంట నర్సాపూర్ గ్రామ సర్పంచ్ రేణి మల్లేష్ ఉన్నారు

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY తెలుగు దిన పత్రిక నిజం మా విజన్



## లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



కామారెడ్డి, మార్చ్ 4, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి నియోజకవర్గం లోని కామారెడ్డి కామారెడ్డి మాచారెడ్డి పాల్వంచ రాజంపేట మండలాల్లో గల కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి మంజీరైన కల్యాణ లక్ష్మి చెక్కులను బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డిఅందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల రెవెన్యూ అధికారులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గర్శకుర్తి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చిన తూడి లచ్చన్న స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించిన తన వీరాభిమాని వికలాంగుడు ఓదెల నరేష్



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 04, తెలంగాణ పత్రిక

కోరిన కోరికలు తీర్చే స్వయంభు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు టి యల్ యువసేన అధ్యక్షులు తూడి లచ్చన్న వెంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించిన నిరుపేద వికలాంగుడు కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నరేష్ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా సన్మానించిననని వికలాంగుల నరేష్ కోరారు మా గ్రామానికి వచ్చిన సందర్భంగా చాలా సంతోషమని రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు మీకు ఉంది అని మా కుటుంబం తరపున మా వికలాంగుల తరపున మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

## జయరాం పార్థివ దేహానికి నివాళులు నల్లమోతు సాంబశివరావు



మిర్యాలగూడ ప్రతినిధి//మార్చి 4:(తెలంగాణ పత్రిక):-

పుట్టలగడ్డ తండ ఉపసర్పంచ్ రూపవత్ సక్రూ పెద్దనాన్న జయరాం మరణం పట్ల మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు సోదరులు నల్లమోతు సాంబశివ రావు మరియు మాజీ జేడ్పిటిసి అంగోతు లలిత హతిరాం నాయక్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జయరాం భౌతికకాయానికి సాంబశివ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఉపసర్పంచ్ సక్రూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని, ఈ కష్టసమయంలో ఆ కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు. జయరాం మరణం వారి కుటుంబానికి తీరని లోటు అని వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని వారు అన్నారు. వారి వెంట టిఆర్ఎస్ పార్టీ నాయకులు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## కామారం తాండ అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో దామోదర్

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మార్చి 4 (తెలంగాణ పత్రిక)



చిన్న శంకరంపేట్ మండలం కామారం తండాలో నీ అంగన్వాడి కేంద్రంలో రికార్డులను పరిశీలించిన మండల ఎంపీడీవో దామోదర్ సర్పంచ్ హలవత్ మోహన్ నాయక్. పిల్లలకు అందించే పౌష్టిక ఆహారం గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. ప్రాథమిక పాఠశాల స్కూల్ లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అనంతరం నర్సరీలను, ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, ఉపాధి హామీ పనులను పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ స్వర్ణలత. గుగులోతు నరేష్, సేనాపతి, బానోత్ మోహన్, దీ.శంకర్, రామ్జు, పీరు తదితరులు పాల్గొన్నారు

## వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని త్రాగునీటి సమస్యల సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారీ

- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మిషన్ భగీరథ. గ్రిడ్ మెదక్ నాగభూషణం

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 03 మార్చి

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని త్రాగునీటి సమస్యల పరిష్కారానికై సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారీకి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మిషన్ భగీరథ. గ్రిడ్ మెదక్ నాగభూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.నీటి సరఫరా నిలుపుదల పై 05 మరియు 06 మార్చి తేదీలలో క్రింది ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు. మెదక్ నియోజకవర్గ పరిధిలోని 275 గ్రామీణ హాబిటేషన్లు, మెదక్ మరియు రామాయంపేట మున్సిపాలి టీలు. ఆందోలు నియోజకవర్గంలోని అల్లాదుర్గ్ మరియు టేక్మాల్ మండలాల 80 హాబిటేషన్లు. ప్రభావిత హాబిటేషన్ల సర్పంచ్‌లకు సంబంధిత మండల గ్రూపుల ద్వారా సమాచారం అందించబడిందని తెలిపారు. సర్పంచులు స్థానిక వనరుల ద్వారా నీటి సమస్యను పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణం మాట్లాడుతూ వచ్చే వేసవి దృష్ట్యా 04.03.2026 మరియు 05.03.2026 తేదీలలో కింది ప్రివెంటివ్ మెయింటెనెన్స్ పనులు చేపట్టడం నిర్ణయించబడిందని తెలిపారు. 90 MLD పెదరెడ్డిపేట WTP వివిధ నిర్వహణ పనుల నిమిత్తం 1000 మి.మీ.డయా



పైప్‌లైన్ లీకేజీల మరమ్మత్తు మరియు రాయిపహాడ్ OHBR వద్ద స్లూయిస్ వాల్వ్ మరమ్మత్తు. అన్ని సివిల్ నిర్మాణాలు (OHBR లు మరియు సంపులు) శుభ్రపరచడం. వంటివి చేపడుతున్నట్లు అలాగే యెల్లాపూర్ వద్ద 700 మి.మీ. DI స్లూయిస్ వాల్వ్ మరమ్మత్తుల 06.03.2026 సాయంత్రం 6 గంటల తరువాత పంపింగ్ పునః ప్రారంభించబడుతుందని తెలిపారు.

## స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను వెనుకకు తీసుకోవాలి

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మండల వెంకన్న

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 04,(తెలంగాణ పత్రిక)

స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను కేంద్ర ప్రభుత్వం వెనుకకు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మండల వెంకన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం లోని మార్క్స్ భవన్ లో జిల్లా అధ్యక్షులు అజ్మీర లాల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఏఐకేఎంఎస్ సమావేశంలో అయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా, యూరప్ యూనియన్ తో చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాల మూలంగా భారతదేశ వ్యవసాయ రంగం కుప్పకూలిపోయే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయని, అభివృద్ధి చెందిన సామ్రాజ్యవాద దేశాల వ్యవసాయ ఉత్పత్తులు మొక్కజొన్న, సోయాబీన్, డైరీ ఉత్పత్తులు ఇబ్బడి ముబ్బడిగా మనదేశంలోకి దిగుమతి చేసుకోవడం వలన చిన్న చిన్న కమతాలు కలిగిన 70 శాతం రైతాంగానికి మరణ శాసనం లిఖించబడుతుందన్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగానికి ఇస్తున్న సబ్సిడీలు, రాయితీలు రద్దు చేయడం వలన ప్రోత్సాహం కరువైందని పేర్కొన్నారు.అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి పండించిన పంటలకు సరైన ధర లేక సతమవుతమవుతున్న మన రైతాంగానికి మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు "స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు" మరింత నష్టం జరిగే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.దీనితో బడా పెట్టుబడిదారీ సంస్థలు భారత వ్యవసాయ రంగాన్ని కబలించబోతున్నాయన్నారు. ఇదే కాకుండా నూతనంగా తీసుకువస్తున్న విద్యుత్ బిల్లు, విత్తన బిల్లు వలన పూర్తిగా వ్యవసాయ రంగాన్ని బహుళ జాతి సంస్థల చేతుల్లో పెట్టడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న ఆర్ఎస్ఎస్ కనుసన్నలలో నడుస్తున్న మోడీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు బట్టబయలైనాయన్నారు. ఇప్పటికే దేశంలోని పబ్లిక్ రంగ పరిశ్రమలను ఒక్కొక్కటి అంబానీ, ఆదానీలకు దారా దత్తం చేశారని విమర్శించారు. భారత దేశ జీవనాడి అయినా వ్యవసాయ రంగాన్ని కూడా



కంపెనీలకు కట్టబెట్టాలని చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని, భారత వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి రైతాంగం ఐక్యంగా ఉద్యమించటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎస్కేయం మార్చి 9వ తేదీన స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలపై ఢిల్లీలో జరుప తలపెట్టిన "మహా పంచాయతీ"ని మార్చి 13 నుండి ఏప్రిల్ 14 వరకు ప్రచార ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టాలని ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని కోరారు. విదేశీపత్తిపై 11శాతం సుంఖాన్ని రద్దు చేయడం వల్ల దేశంలోని రైతులు పండించిన పత్తి కి గిట్టుబాటు ధర రాకుండా పోతుందని, సి సి ఐ నిర్ణయించిన ధర రూ: 8129 పలకటం లేదని, ప్రైవేటు వ్యాపారస్తులు పత్తికి క్వింటా ఒక్కంటికి రూ, 5 వేలు నుండి రూ 6 వేలకు మించటం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి పత్తి రైతులకు నిర్ణయించిన రేటు ప్రకారం 8 వేల 129 రూపాయలు రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కామ్రేడ్ రత్నం తిరుపతి, కిష్టన్న, పోషన్న, రమేష్, రాజేష్, రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

## స్వరూప్ నగర్‌లో రూ.1.82 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం





- మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఉప్పల్ మార్చ్ 4 తెలంగాణ పత్రిక

ఉప్పల్ డివిజన్ లోని స్వరూప్ నగర్ లో రూ.1.82 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లుగా మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు ఇప్పటికే రూ.69 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టినట్లుగా చెప్పారు రజిత పరమేశ్వర్ రెడ్డి బుధవారం స్వరూప్ నగర్ లో కాలనీ వాసులతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తోందని ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టుగా చెప్పారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా తెలిపారు ఈ కార్యక్రమం లో స్వరూప్ నగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ వెంకటేశ్వర్ రెడ్డి, సిద్దేశ్వర్, పూజారి హనుమంతు సల్ల ప్రభాకర్ రెడ్డి అమరేందర్రావు శ్రీనివాసరెడ్డి, జ్ఞానేశ్వర్, సత్యనారాయణ, ఆనంద్ ప్రభు, కుమార్, పిసటి అంజిరెడ్డి, వెంకటేష్, రాకేష్ నాయక్, సురేష్, పవన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ

- బిఆర్ఎస్ సీనియర్ నాయకులు
- సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల మహేందర్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఉప్పల్ ఫిబ్రవరి 4 తెలంగాణ పత్రిక




ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఉప్పల్ బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల మహేందర్ ఆద్వర్యంలో బుధవారం ఉప్పల్ సర్ మౌంట్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల మహేందర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, గురువులు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.ఇప్పటికే బండారి లక్ష్మారెడ్డి ఆద్వర్యంలో ర్యాంకు మీది ఫీజు నాది కాన్సెప్ట్‌తో ఎం బీ బీఎస్ ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఫీజులు అందించిన ఘనత ఎమ్మెల్యేకు దక్కిందని గుర్తు చేసారు. ఈ కార్యక్రమం లో పాఠశాల యాజమాన్యం, బీఅర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# చిట్టిపోలు వారి వివాహ వేడుకలలో పలువురు రాజకీయ నాయకులు

**- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఉప్పల్ మార్చ్ 4 తెలంగాణ పత్రిక

నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తోడికోడలు కూతురు, (బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ అన్న రమేష్ ఉదయ శ్రీ దంపతుల కుమార్తె ) యోగిత వివాహ వేడుక పీర్జాదిగూడలోని శ్రీ పలని కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించబడింది కుటుంబ సభ్యులు బంధు మిత్రులు పార్టీ నాయకులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ శుభకార్యానికి మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు అలాగే ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎల్బీనగర్ శాసనసభ్యులు సుధీర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు బేతి సుభాష్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్లు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరై వధూవరులకు తమ ఆశీస్సులు అందజేశారు ఈ వివాహ వేడుక ఆనందోత్సాహాల



మధ్య సాంప్రదాయబద్ధంగా ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది.

# 150 సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం

కామారెడ్డి, మార్చి 4, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలో అధిక శబ్దం చేసే సైలెన్సర్ల పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. కొన్ని బైకులకు విపరీతమైన శబ్దం వచ్చే విధంగా మార్పులు చేసి యువత రోడ్ల పై ర్యాష్ డ్రైవింగ్ చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 150 అధిక శబ్ద సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని, నిజాం సాగర్ చౌరస్తాలో రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. వాహనదారులపై జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమం అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో, పట్టణ సీఐ నరహరి పర్యవేక్షణలో నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ మహేష్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణ సీఐ నరహరి మాట్లాడుతూ, అధిక శబ్దంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వాహనాలపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు రోడ్డు భద్రత



నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఎంపీడీవో కార్యాలయంలో బాల్య వివాహాలు, అక్రమ దత్తతను అరికట్టాలి ఎంపీడీవో వంశీధర్





**- మాతృత్వం ఒక వరం అందుకు దత్తత మరో మార్గం**

మాడుగుల పల్లి//నల్గొండ//మార్చ్ 4:(తెలంగాణ పత్రిక)'-

దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోగల మాడుగులపల్లి మండలంలో ఈరోజు ఎంపీడీవో కార్యాలయంలో కన్వర్జెన్సీ మీటింగ్ సిడిపిఓ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ చంద్రకళ మాట్లాడుతూ మండలంలో గల గ్రామాలలో బాల్యవివాహాలు జరగకుండా నిర్మూలించడం మరియు పిల్లల అక్రమ దత్తత జరగకుండా చూడాలని గ్రామ అధికారులు అందరికీ కూడా ఇట్టి విషయాన్ని తెలియజేయాలని మండలాధికారులకు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పంచాయతీ సెక్రటరీలకు తెలియజేస్తామని బాల్య వివాహాలు జరగకుండా చూస్తామని చెప్పడం జరిగింది. మరియు ఎమ్మార్వో మా పరిధిలో ఉన్నటువంటి జిపిఓ లకు తెలియజేస్తామని చెప్పారు ఎస్సై ఏ గ్రామంలోనైనా బాల్య వివాహాలు జరిగిన కేసు నమోదు చేయడం జరుగుతుందని పిల్లల అమ్మకాలు జరిగిన అక్రమ దత్తత జరిగిన కేసు నమోదు చేయడం జరుగుతుందని మండల అధికారులకు తెలియజేయడం జరిగింది. కావున గ్రామ పరిధిలో ఉన్న పోలీస్ డిపార్ట్మెంట్ వారికి కూడా తెలియజేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ చంద్రకళ, ఎమ్మార్వో సరోజా పావని, ఎంపీడీవో వంశీదర్, ఎస్సై. కృష్ణయ్య, ఎంపీవో సంగీత, ఏపీఎం మధు, ఎంఆర్ఓ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ రమణి, ఎపిఓ శ్రీనివాస్ రెడ్డి, సూపర్వైజర్ జి.లక్ష్మి, జ్.నాగమణి, పోషణ అభియాన్ రమణి, అంగన్వాడీ టీచర్స్ సుశీల, మరియమ్మ, సాయమ్మ, అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లకు కంటి చూపు ముఖ్యం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి, మార్చి 4, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

డ్రైవర్లకు కంటిచూపు చాలా ముఖ్యమని కామారెడ్డి జిల్లాఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ కార్యాలయంలో బుధవారం డ్రైవర్లకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 136 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించగా 20 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. చికిత్స చేయించేలా చర్యలు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి, మరణాల సంఖ్య తగ్గు ముఖం చికిత్స చేయించేలా చర్యలు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. చికిత్సలు అవసరమైన డ్రైవర్లకు డోనర్ల సహకారంతో పోలీస్ శాఖ తరపున చికిత్స చేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రమాదంలో ఒక కుటుంబ యజమాని ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబానికి కోలుకోలేని నష్టం జరుగుతుందని వివరించారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి**

రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ఏడాది కాలంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎస్పీ తెలిపారు. ప్రతినెలా చివరి వారంలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ నెలలో ప్రత్యేకంగా డ్రైవర్ల కంటి చూపుపై దృష్టి సారించినట్లు తెలిపారు. వయస్సు




పెరిగే కొద్దీ చూపు మందగించడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉంటుందన్నారు. అందుకే డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

**మరణాల సంఖ్య తగ్గు ముఖం**

పోలీస్ శాఖ చేపడుతున్న చర్యల ఫలితంగా జిల్లాలో రోడ్డు ప్రమాద మరణాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతున్నట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. 2024 ఫిబ్రవరి నెలలో 22 మరణాలు నమోదు కాగా, 2025 ఫిబ్రవరి నెలలో 14 మరణాలు, 2026 ఫిబ్రవరి నెలలో 12 మరణాలు మాత్రమే నమోదయ్యాయని వెల్లడించారు.

# పుట్ట ఎల్లయ్య మృతి లో పాల్గొన్న బంధుమిత్రులకు భోజనం ఏర్పాట్లు

**- అంత్య క్రియలకు హాజరైన బంధువులకు భోజనం అందించిన సర్పంచ్ అనిత- వెంకట్ రెడ్డి**

మాడుగులపల్లి/నల్గొండ/మార్చి 4:(తెలంగాణ పత్రిక):-

మండలంలోని ఇస్కబావిగూడెం గ్రామానికి చెందిన పుట్ట ఎల్లయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది. ఆ విషయం తెలిసిన వెంటనే పుట్ట ఎల్లయ్య అంత్యక్రియలకు దూర ప్రాంతాల నుండి హాజరైన బంధు మిత్రులకు కుటుంబ సభ్యులకు గ్రామ పంచాయతీ సర్పంచ్ కల్లూరి అనిత-వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భోజనం ఏర్పాట్లు చేయడం జరిగింది. మృతుని అంత్యక్రియలు ముగిసిన అనంతరం బంధుమిత్రులు కుటుంబ సభ్యులకు సర్పంచ్ కల్లూరి అనిత దగ్గరుండి స్వయంగా భోజనం వడ్డించారు. గ్రామ సర్పంచ్ కల్లూరి అనిత సేవా కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు.



# జాతీయ జన గణనలో కుల గణన చేపట్టాలి

**- రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన మాజీమంత్రి జీవన్ రెడ్డి.**



జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మార్చ్ 4

జగిత్యాల జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ జనగణన లో కుల గణన చేపట్టాలని మాజీ మంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసిన జీవన్ రెడ్డి.కులాల వారీగా ఖచ్చితమైన జనాభా లెక్కలు ఉంటేనే బీసీలకు చట్టబద్ధంగా సముచిత రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లతో పాటు కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం కూడా కలుగుతుందని ఆయన అభిప్రాయ పడ్డారు. రాబోయే శాసనసభ సమావేశాల్లో ఈ అంశం పై తీర్మానం చేసి కేంద్రానికి నివేదించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవే నా లక్ష్యం గ్రామ ప్రజల దహన్ని తీరుసున్న

**- యూసుఫ్పూర్ సర్పంచ్ పట్లోళ్ల సంగారెడ్డి**

తెలంగాణ పత్రిక ప్రతినిధి



సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం యూసుఫ్పూర్ గ్రామం లొ దశాబ్ద కాలం నుంచి నెలకొన్న సమస్య నీటి ఎద్దడీ గ్రామం లొ నీరు లెక గ్రామ ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారు వ్యవసాయ పొలాల నుంచి నీటిని తెచ్చుకొని అవసరాలను తీర్చుకుంటు న్నారు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చూసి ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంతో సర్పంచ్ అభ్యర్థిగా గెలుపొంది గ్రామంలో నూతనంగా బోర్ వేయించి ప్రజల యొక్క నీటి ఇష్టాన్ని తీర్చారు దీంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు మరియు సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్లు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు

**- ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఉప్పల్ మార్చి 4 తెలంగాణ పత్రిక

శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం ఇందిరానగర్, రామంతపూర్‌లో వార్షిక బ్రహ్మోత్సవముల్లో భాగంగా జరిగిన కళ్యాణం లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రామంతపూర్ బి ఆర్ ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వరరావు పాల్గొన్నారు ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఆ స్వామి వారి ఆశీస్సులు అందరి మీద వుండాలి అని ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన కోరుకున్నారు ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు భక్తులు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ కంచ ఐలయ్యను సన్మానించిన కురుమ సంఘం

పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:- మార్చి 04. (తెలంగాణ పత్రిక ప్రతినిధి):



మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రం పరిధిలోని బొల్లెపల్లి గ్రామంలో బుధవారం రోజున మహబూబాబాద్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు చీర అశోక్ కురుమ ఆధ్వర్యంలో, కురుమ కులస్తుడు ప్రొఫెసర్ కంచ ఐలయ్య కురుమను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏరా ముత్తయ్య కురుమ, నెల్లికుదురు మండల అధ్యక్షుడు కోరే శ్రీనివాస్ కురుమ, మహబూబాబాద్ జిల్లా ముఖ్య సలహాదారుడు కోరే దేవేందర్ కురుమ, గూడూరు గ్రామ అధ్యక్షుడు కోరే కుమారస్వామి కురుమ, దొడ్డి కొమురయ్య విగ్రహ ప్రధాన కార్యదర్శి పోతరాజు రవి కురుమ, మాజీ కురుమ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు మండల మల్లేష్ కురుమ, కంకల శ్రీను కురుమ, కెంచ కట్టయ్య కురుమ, కురుమ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సాయి దీక్షిత్ ను అభినందించిన కార్మెల్ పాఠశాల ప్రిన్సిపల్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 04,(తెలంగాణ పత్రిక)



మంచిర్యాలలోని కార్మెల్ కాన్వెంట్ పాఠశాల కు చెందిన సాయి దీక్షిత్ గత నెల 25 నుండి ఈనెల ఒకటో తేదీ వరకు వెస్ట్ బెంగాల్‌లో జరిగిన సబ్ జూనియర్ వాలిబాల్‌కు జాతీయ స్థాయిలో మన రాష్ట్రం నుండి జట్టుకు ప్రాతినిత్యం వహించినందుకు సాయి దిక్షిత్ ను కార్మెల్ పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సారూప్య,వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ సీమ,సిస్టర్ సోఫి తోపాటు పి ఈ టి లు అనిల్, ఫ్రాన్సిస్, సిబ్బంది అభినందించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ శ్రేణులు



దేవరుప్పుల, మార్చి 4 తెలంగాణ పత్రిక):

మండలంలోని అప్పి రెడ్డి పల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ సీనియర్ నాయకుడు కొంగరి శ్రీనివాస్ తండ్రి కొంగరి చంద్రయ్య అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. నేపథ్యంలో మండల ఆర్ఎస్ శ్రేణులు చంద్రయ్య మృతదేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు బస్వ మల్లేశం, మాజీ ఎంపీపీ కొల్లూరీ సోమయ్య, మండల అధికార ప్రతినిధి సుడిగెల హనుమంతు, పాము మోహన్, మేకల సంపత్, ఎండి కాసిం, కౌడగాని అంజయ్య, పులిగిల్ల సుధాకర్, బాషిపల్లి కోటి, కాంటారి సత్యనారాయణ, పిట్టల సోమయ్య, లోనే మహేందర్, దండు నర్సింలు, దండు కొమురయ్య, నాగారపు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## అల్లం స్వప్న బాలకిషోర్ రెడ్డి సారథ్యంలో ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ప్రభ బండి...

పరకాల గీసుకొండ మార్చి 4 తెలంగాణ పత్రిక




వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో 54 ఫీట్ల హైడ్రాలిక్ ప్రభ బండి జాతరలో విశేష ఆకర్షణగా నిలిచి చారిత్రాత్మక ఘన విజయం సాధించింది. సాంకేతికతతో భక్తి వైభవాన్ని కలిపిన ఈ మహత్తర ఆవిష్కరణ కొమ్మాల జాతర చరిత్రలో ప్రత్యేక మైలురాయిగా నిలిచింది. ఈ కార్యక్రమానికి కొండా మురళీధర్ రావు , కొండా సుష్మిత పటేల్ హాజరై కార్యక్రమానికి మరింత గౌరవాన్ని తీసుకొచ్చారు. అద్భుత సమన్వయంతో & అల్లం స్వప్న దేవి బాలకిషోర్ రెడ్డి , వీరగోని రాజ్ కుమార్, రడం భరత్ , శ్రీ అల్లం మర్రెడ్డి ఈ మహా వేడుకను ఘనంగా నిర్వహించారు. మనుగొండ సర్పంచ్ పేర్ల శ్రవణ్, కొమ్మాల సర్పంచ్ కన్నెబోయిన యమునా ప్రవీణ్, సూర్య తండా సర్పంచ్ బానోతు రాఘవేంద్ర, దశ్రు తండా సర్పంచ్ అమృత బిక్షపతి, ఆధునిక ప్రభు బండికి విశేషంగా కృషి చేసిన బానోతు శ్రీనివాస్, ఈవెంట్ ఆర్గనైజర్ గుప్తతో పాటు మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సాంకేతికతతో చరిత్ర సృష్టించిన అల్లం స్వప్న బాలకిషోర్ రెడ్డి ఘన విజయోత్సవం!అల్లం బాలకిషోర్ రెడ్డి యువ సైన్యం

## మల్లంపల్లి ముదిరాజ్ సంఘ పెద్దలు తాళ్ళ రవీందర్‌ను పరామర్శించిన

నర్సంపేట మార్చి 4 తెలంగాణ పత్రిక



దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లె గ్రామంలో కొద్ది రోజుల క్రితం ట్రాక్టర్ ప్రమాదంలో తాళ్ళ సుగుణమ్మ పరమపదించారు. వీరి కుమారుడు, ప్రస్తుతం పీఆర్ ముదిరాజ్ సేవా సమితి వరంగల్ జిల్లా బాధ్యులైన తాళ్ళ రవీందర్ ముదిరాజ్‌ను మల్లంపల్లి ముదిరాజ్ సంఘ పెద్దలు పరామర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ కు సానుభూతి తెలిపి, తల్లి ఆత్మకు రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం సోడా సమ్మయ్య ముదిరాజ్ మాట్లాడుతూ "తాళ్ళ సుగుణమ్మ, మల్లేశం దంపతులు వారు నమ్ముకున్న పార్టీకి, ముదిరాజ్ జాతి బిడ్డలకు ఎనలేని సేవలు అందించిన పుణ్యాత్ములు. వీరి మరణం పేద బిడ్డలకు తీరని లోటు" అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి ముదిరాజ్ సరుకోల పెద్దమనిషి, సోడా వేణు (మత్స్యశాఖ ఉపాధ్యక్షులు), సోడా సమ్మయ్య ముదిరాజ్, సోడా కృష్ణ భూమ రంజిత్, లక్క మహేందర్, సోడా రాజు, పీఆర్ ముదిరాజ్ సేవా సమితి డివిజన్ నాయకులు ముద్రబోయిన రమేష్ ముదిరాజ్, ఏ రాజు తదితర కుల బంధువులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు ఆమనగల్లు జాతరలో అపశృతి

- అగ్నిగుండం దాటుతున్న క్రమంలో పలువురి భక్తులకు తీవ్ర గాయాలు
- చాకచక్యంగా స్పందించిన వేములపల్లి మాడుగులపల్లి ఎస్ఐలు పోలీస్ సిబ్బంది

మిర్యాలగూడ ప్రతినిధి//మార్చి 4:(తెలంగాణ పత్రిక):-



ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన నల్గొండ జిల్లా వేములపల్లి మండలం పరిధిలోని ఆమనగల్లు గ్రామంలో కొలువితీరిన శ్రీ శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి జాతరలో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రాంతంలో ప్రమాదవశాత్తు చోటుచేసుకుంది. భక్తుల కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారమైన శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతి ఏడు హోలీ పండుగ పర్వదినాన పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తారు. ఈజాతర మంగళవారం మొదలు కావడంతో జాతరకు జిల్లాలతో పాటు వివిధ మండలాలు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలించారు. దీంతో జాతర కన్నుల పండుగగా కొనసాగింది. ప్రసిద్ధి ఆధ్యాత్మిక కేంద్రంగా వెలసిల్లుతున్న శ్రీ రామలింగేశ్వర స్వామి జాతరలో ఎన్నడు ఇలాంటి ఘటన చోటు చేసుకోలేదు అని గ్రామస్తులు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతరలో ప్రతి సంవత్సరం లాగానే అగ్నిగుండం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా స్వామివారి పల్లకి అగ్గిగుండం దాటుతుండగా పల్లకి వెనకాలే దాటడానికి ప్రయత్నించిన భక్తులు తమ మొక్కులో భాగంగా అగ్నిగుండం దాటుతున్న క్రమంలో పలువురు అగ్నిగుండంలో పడిపోయారు. దీంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి వీరికి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే ఎస్ఐ లు పోలీస్ సిబ్బంది స్పందించడంతో పెను ప్రమాదమే తప్పింది. జాతర భక్తులతో కిటకిటలాడుతుంది ఉన్నట్టుండి ఒక్కసారిగా జాతరలో భయంకరణమైన అరుపులతో ఆ ప్రాంతం అంత దద్దరిల్లింది ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే పెనుప్రమాదం చోటుచేసుకుంది. జాతరలో బుధవారం తెల్లవారు జామున అగ్నిగుండం దాటుతున్న క్రమంలో పలువురు భక్తులు ప్రమాదవశాత్తు అదుపుతప్పి అగ్నిగుండంలో పడిపోయారు. దీంతో వారిపై నుంచి మిగతా భక్తులు దాటి వెళ్లారు. దీంతో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వేములపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు మాడుగులపల్లి ఎస్సై కృష్ణయ్యలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా మెరుపు వేగంతో స్పందించారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వారిని అగ్గి కుండం నుంచి బయటకు తీశారు. పోలీసులు స్పందించిన తీరును అక్కడున్న భక్తులు తో పాటు పలువురు అభినందనలు తెలియజేశారు.

## ఏరియా విభాగాధిపతులు, అధికారులతో బొగ్గు ఉత్పత్తి ఉత్పధాకతల పై సమీక్షా సమావేశం

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 4



బుధవారం న కొత్తగూడెం ఏరియాలోని విభాగాధిపతులు, అధికారులతో జిఎం చాంబర్ నందు కొత్తగూడెం ఏరియాకు ఈ ఆర్థిక సంవత్సరం 2025-26 లో నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకతలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జిఎం ఎం. షాలేం రాజు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) చివరి నెల మార్చిలోకి వచ్చామని ఈ సంవత్సరం కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణనకు మొదటి ప్రాధాన్యతను ఇస్తూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని అందుకు కొరకు తీసుకోవలసిన చర్యల గురించి సంబంధిత వివిధ విభాగాల అధిపతులు, అధికారులతో చర్చించడం జరిగింది. అలాగే నూతనంగా అనుమతులు తీసుకున్న వికే కోల్ మైన్స్ నుండి మట్టి తొలగింపు పనులు త్వరిత గతిన పూర్తి చేసుకొని బొగ్గు వెలికితీతకు కృషి చేయాలని వీకే కోల్ మైన్స్ సంబంధిత ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.వి నరసింహారావు కి ఇతర సంబందించిన అధికారులకు తెలియజేస్తూ, రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నుండి బొగ్గు రవాణాకు ఎటువంటి అంతరాయం కలగకుండా ఉత్పత్తి అయిన బొగ్గును రవాణా చేయాలని ఆర్.సి. హెచ్.పి సంబంధిత అధికారులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం జిఎం తోపాటు ఏరియా ఇంజనీర్ కే సూర్యనారాయణ రాజు, వికెసీఎం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంవీ నరసింహారావు, ఏజిఎం (సివిల్) సిహెచ్. రామకృష్ణ, ఏజిఎం ( ఫైనాన్స్) ఈ.బీభత్స, ఏజిఎం (పర్సనల్) జి.వీ మోహన్ రావు, ఏజెంట్ రామ్ భరోస్ మహతో, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం వెంకటేశ్వర్లు, డిజిఎంలు ఎన్. యోహాన్, జై క్రిస్టఫర్, ఇంచార్జ్ ఆర్.సి.హెచ్.పి అజ్మీర శ్రీనివాస్ వివిధ విభాగాలధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆర్యభట్ట స్కూల్ ఘటన పై అధికారుల దర్యాప్తు

పాలకుర్తి/తొర్రూరు(తెలంగాణ పత్రిక) ప్రతినిధి పున్నం సారయ్య :



తొర్రూరు పట్టణంలోని ఆర్యభట్ట స్కూల్‌లో చోటుచేసుకున్న వివాదాస్పద ఘటనపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందిన వెంటనే అధికార యంత్రాంగం అప్రమత్తమై బుధవారం విచారణకు దిగింది. మహబూబాబాద్ జిల్లా డీఈవో స్వయంగా పాఠశాలను సందర్శించి ఘటన స్థలాన్ని పరిశీలించడంతో పాటు ప్రాథమిక వివరాలు సేకరించారు. అనంతరం ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని నెల్లికుదురు ఎంఈఓకు ఆదేశాలు జారీ చేశారు. డీఈవో సూచనల మేరకు పాఠశాలకు చేరుకున్న ఎంఈఓ ఘటన స్థలాన్ని నిశితంగా పరిశీలించి బాధిత విద్యార్థి తల్లిదండ్రులు, స్కూల్ కరస్పాండెంట్ మధుకర్ రెడ్డి, సంబంధిత విద్యార్థులు, వార్డెన్లు, ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బందిని విడివిడిగా విచారించారు. విచారణ సందర్భంగా పాఠశాల నిర్వహణలోని లోపాలు, సంఘటనకు దారితీసిన పరిణామాలు, పర్యవేక్షణ వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, అధికారుల సమక్షంలోనే కరస్పాండెంట్ మధుకర్ రెడ్డి బాధిత విద్యార్థి తల్లిదండ్రులకు 'కేసు పెట్టుకోండి' అని చెప్పడం చర్చనీయాంశం గా మారింది. దీని పై అక్కడున్నవారిలో ఆశ్చర్యం వ్యక్తమైంది. ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించినట్లు ఎంఈఓ వెల్లడిస్తూ, పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ మరియు డీఈవోకు సమర్పించనున్నట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ పరిణామాలు స్థానికంగా చర్చకు దారి తీస్తున్నాయి.

# హామీల అమలు ఇల్లంతకుంటలో అభివృద్ధి పనులకు వేగం

ఇల్లంతకుంట మార్చి 4 తెలంగాణ పత్రిక



ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతున్నాయి. సర్పంచ్ ఎం. రాజు ఆధ్వర్యంలో పలు సమస్యల పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయి. గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజ్ సమస్యల నివారణకు శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, అవసరమైన ప్రాంతాల్లో కొత్త డ్రైనేజ్ లైన్ల ఏర్పాటుకు ప్రక్రియ ప్రారంభించారు. దీంతో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగు పడుతున్నాయి. రాత్రి వేళల్లో చీకట్లు లేకుండా కొత్త వీధి దీపాలను అమర్చారు. మండల కేంద్రంలోని డివైడర్ వద్ద నిలిచిపోయిన కేంద్రీయ దీపాన్ని క్రేన్ సాయంతో మరమ్మతు చేసి తిరిగి వెలిగేలా చేశారు. ప్రధాన రహదారి వెలుగులతో కాంతిమయం అయింది. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2 నుంచి గ్రామంలో ప్లాస్టిక్ నియంత్రణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామంలో తక్కువ విద్యుత్ ఒత్తిడి సమస్య పరిష్కారానికి పలు ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటున్నారు. దీనితో విద్యుత్ సరఫరా మెరుగుపడనుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మృతి చెందిన వారి కుటుంబాలకు దహన సంస్కారాల నిమిత్తం రూ.10,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు రూ.1.50 లక్షలు పలు కుటుంబాలకు పంపిణీ చేశారు. మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ప్రత్యేక గ్రామసభలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. అలాగే ఆర్మీ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసిన యువకులకు అవసరమైన మార్గనిర్దేశం, సహాయం అందించనున్నారు.

# మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్' సేవలు అభినందనీయం

- రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ కిట్ల పంపిణి అభినందనీయం
- యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి హమీద్ షేక్

మిర్యాలగూడ ప్రతినిధి//మార్చి 4:(తెలంగాణ పత్రిక):-



మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సేవలు అజరామరం అని నల్లగొండ జిల్లా ప్రఖ్యాత సోషల్ సర్వీస్ ఆర్గనైజర్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలకు ఆర్యవైశ్యులే మార్గదర్శి అని కొనియాడారు. రంజాన్ పండుగ సందర్భంగా పలు ముస్లిం కుటుంబాలకు హమీద్ షేక్ చేతుల మీదుగా రైస్ మిల్లర్లు రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో హమీద్ షేక్ మాట్లాడుతూ మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు మానవత్వానికి, దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారని కొనియాడారు. సర్వమత సమానత్వాన్నీ, సౌభ్రాతృత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రతి ఏడాది పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం కుటుంబాలకు తమ వంతుగా సాయమందిస్తున్నారని అన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో పలు కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేసి ఆదుకున్నారని అన్నారు. విపత్కర పరిస్థితుల్లో సహృద్భావంతో, సేవానిరతితో అనేక మంది యువతలో ఆర్యవైశ్యులు స్ఫూర్తి నింపారని అన్నారు. తాజాగా పలు ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారని చెప్పారు. మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పాలక మండలి తరపున హమీద్ షేక్ ముస్లిం సోదరసోదరీమణులకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. భక్తి శ్రద్ధలతో ప్రతీ ఒక్కరూ నెలరోజుల పాటు రంజాన్ ఉపవాస దీక్షలను చేపట్టాలని, ప్రపంచ శాంతి కోసం అల్లాను ప్రార్థించాలని కోరారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు శక్తివంచన లేకుండా సాయం అందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్నారైలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని హమీద్ షేక్ పిలుపునిచ్చారు. రంజాన్ కిట్ల పంపిణీ అనంతరం తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్ మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గోళ్ళరామ్ శేఖర్, కార్యదర్శి బాబీ, పోలిశెట్టి ధనుంజయ, కోశాధికారి గందె రాముకు హమీద్ షేక్ హార్థిక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రషీద్, ముర్తుజా, హాజీ, తదితరులు పాల్గొన్నారు.

# మరుగుదొడ్లకు కనీస వసతుల కరువు

- మలమూత్ర విసర్జనకు మహిళలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు ప్రజా ప్రతినిధులు

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మార్చి 4




రాజన్న సిరిసిల్ల జిల్లా గంబీరావుపేట మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీలో డోరు కరువుగా మారింది మలమూత్ర విసర్జనకు మహిళలు ఇబ్బంది పడుతున్నారు పంచాయతీ పాలకవర్గంతో పాటు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అటు ఉద్యోగాల్లో ఇటు వ్యాపారాల్లో మగవారితో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు కొన్నిసందర్భాల్లో సమస్యలు ఎదు ర్కోవాల్సి వస్తోంది. ప్రధానంగా ప్రజా మరుగుదొడ్ల అందుబాటులో లేక వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు గ్రామ పంచాయతీలు బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జణ రహిత గ్రామాలుగా ప్రకటించుకున్నాయి. ఈ మండల కేంద్రంలో ఇంటింటికీ మరుగుదొడ్ల ఏర్పాటు చేసుకున్నారు. కానీ మండల కేంద్రంతోపాటు గ్రామా లకు వచ్చిపోయే వారికి బహిరంగ మరుగుదొడ్ల లేక మలమూత్ర విసర్జనకు ఇబ్బంది పడుతున్నారు. 20 రోజుల క్రితం గ్రామసభలో కూడా ప్రజలు మహిళలలు ఇబ్బంది పడుతున్నారని అటు పాలకవర్గానికి అధికారులకు చెప్పిన గాని నిమ్మకు నీరతనట్టు వ్యవహరిస్తున్నారు. బాత్రూం డోర్ విరిగిపోయి చాలా నెలలు అవుతున్నా కానీ దాని అధికారి కానీ అటు పాలకవర్గం కానీ బాత్రూం డోర్ చేయలేని పరిస్థితి ప్రజల నుంచి వచ్చిన ఇంటి పన్ను ఇతర పన్నులు ఆదాయం ఎటు వెళ్లిపోతుందని ప్రజలు ముక్కున వెలుసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకవర్గం స్పందించి ఈ సమస్య పరిష్కారం చేయాలని మహిళలు కోరుతున్నారు.

# కొమ్మాల జాతరకు కదిలిన కాంగ్రెస్ పార్టీ ప్రభ బండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట మార్చి 4 తెలంగాణ పత్రిక



నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, గీసుకొండ మండలం కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి జాతరను పురస్కరించుకొని నర్సంపేట నియోజకవర్గం నుండి వందలాదిగా కదిలిన కాంగ్రెస్ పార్టీ ప్రభ బండ్లను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి , కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ పూర్వం నుండి హోలీ పర్వదినం నుండి ప్రారంభమయ్యే కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి జాతరకు నర్సంపేట నియోజకవర్గం తో పాటు వరంగల్ జిల్లాలో ప్రభ బండ్లను కట్టే ఆనవాయితీ కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ తరపున నర్సంపేట నియోజకవర్గంలోని వందలాది గ్రామాల నుంచి ప్రభలు కట్టి లక్ష్మీ నరసింహ స్వామి జాతరలో ఉత్సాహంతో మెల తిరిగి లక్ష్మీ నరసింహ స్వామి కరుణాకటాక్షాలకు పాత్రులై ఈ ప్రాంతమంతా కూడా సుభిక్షంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు అంతేకాకుండా కొమ్మల లక్ష్మీ నరసింహ స్వామి ఎంతో మహిమ గల దైవమని ఆ లక్ష్మీనరసింహ స్వామి దీవెనలతో నర్సంపేట నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని,పెద్ద ఎత్తున ప్రబల వెంట గ్రామాలలోని ప్రజలు,మహిళలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భాజా భజంత్రీలతో కాంగ్రెస్ పాటలతో నాట్యాలాడుతూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నర్సంపేట మున్సిపాలిటీ చైర్పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి, దుగ్గొండి మండలం అధ్యక్షులు చుక్క రమేష్ గౌడ్, నర్సంపేట మండల అధ్యక్షులు కత్తి కిరణ్ గౌడ్, నల్లబెల్లి మండల అధ్యక్షులు చిట్యాల తిరుపతిరెడ్డి, ఖానాపురం మండల అధ్యక్షులు శాఖమూరి హరిబాబు, చెన్నరావుపేట మండల అధ్యక్షులు సిద్దెన రమేష్, కౌన్సిలర్ వేముల సంధ్య సాంబయ్య గౌడ్ , మండల నాయకులు చెన్నూరి కిరణ్ రెడ్డి, కౌన్సిలర్లు,సర్పంచులు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాజాగూడ, ఐఐటీ జంక్షన్లలో రోడ్డు విస్తరణ పనుల పై ఉన్నతాధికారుల తనిఖీ







- త్వరితగతిన పూర్తి చేయాలని సీసీపీ ఆదేశం

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, మార్చ్ 04(తెలంగాణ పత్రిక)

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ, జంక్షన్ అభివృద్ధి పనుల పై ఉన్నతాధికారులు సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. కమిషనర్ ఆదేశాల మేరకు సీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ (సీసీపీ) ఖాజాగూడ జంక్షన్, సీపీ సైబరాబాద్ 215 అడుగుల రోడ్డు (టెలికాం నగర్ రోడ్డు), ఐఐటీ జంక్షన్, తారానగర్ రోడ్డులో జరుగుతున్న పనులను మంగళ వారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జోన్ సిటీ ప్లానర్, సర్కిల్49 అసిస్టెంట్ సిటీ ప్లానర్, ప్రాజెక్ట్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), టౌన్ ప్లానింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు పనుల పురోగతి, రోడ్డు విస్తరణలో ఎదురవుతున్న సమస్యలు, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు వంటి అంశాల పై స్థలంలోనే చర్చించారు. ప్రధానంగా ఖాజాగూడ మరియు ఐఐటీ జంక్షన్ల వద్ద పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని జంక్షన్ డెవలప్మెంట్ పనులు సమయానికి పూర్తిచేయాల్సిన అవసరాన్ని సీసీపీ గుర్తు చేశారు. రోడ్డు ఫార్మేషన్ పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే పనులు నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు.

## ప్రభ బండిని కొబ్బరికాయ కొట్టి ప్రారంభిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం లక్ష్మి రామానంద్



నర్సంపేట మార్చి 4 తెలంగాణ పత్రిక

మన ప్రియతమ నాయకులు పెద్దలు దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం శ్రీ కొమ్మల నరసింహస్వామి వారి పట్టణ 4వ వార్డ్ కౌన్సిలర్ బీరం భరత రెడ్డి ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభ ను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన.. మున్సిపల్ చైర్పర్సన్ పెండెం లక్ష్మీ రామానంద్ ఈ కార్యక్రమంలో 30 వార్డ్ కౌన్సిలర్ మాదాసి రవి.వార్డు ప్రజలు. యూత్ సభ్యులు నియోజకవర్గ అధ్యక్షులు తుమ్మలపల్లి సందీప్. నర్సంపేట పట్టణ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎండి సల్మాన్. రాహుల్. గణేష్ శాలుమ్ రాకేష్ శివమణి తదితరులు పాల్గొన్నారు.

## జనగణన శిక్షణకు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి



మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 04 మార్చి

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సైన్స్ అధికారి రాజిరెడ్డి బుధవారం కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ ను జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేసీ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి రేపటినుండి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ నందు కొనసాగే జన గణన శిక్షణకు హాజరై జిల్లాలో రాబోయే వేసవిలో మొదటి దశ లోజరిగే ఇండ్ల గణనను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

## కొబ్బరికాయ కొట్టి ప్రభ బండ్లను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

నర్సంపేట మార్చి 4 తెలంగాణ పత్రిక



వరంగల్ జిల్లా నర్సంపేట నియోజక వర్గం దుగ్గొండి మండలం గిర్నిబావిలో బిఆర్ఎస్ పార్టీ ప్రభ బండ్లను ప్రారంభించిన నర్సంపేట మాజీ శాసన సభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, మండల పార్టీ అధ్యక్షుడు సుకినె రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య,నియోజకవర్గ యూత్ కన్వీనర్ సానబోయిన రాజకుమార్, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, క్లస్టర్ బాధ్యులు, మండల నాయకులు, సర్పంచ్లు,మాజీ సర్పం హు, ఎంపీటీసీలు, గ్రామా పార్టీ అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల బిల్లుల చెల్లింపుల జాప్యం చేయొద్దు

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 04 మార్చి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల బిల్లు చెల్లింపుల్లో జాప్యం చేయొద్దు అన్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సురక్షితమైన, శాశ్వత నివాస గృహాలు అందించడం లక్ష్యమని తెలిపారు.నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టంగా ఆదేశించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకున్నారు. నిర్మాణ సామగ్రి సరఫరా, బిల్లుల చెల్లింపులు, సాంకేతిక సిబ్బంది పర్యవేక్షణ వంటి అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజం



## రామాయంపేట పట్టణంలో 9.10 ప్రశిక్షణ మహా అభ్యాన్ శిక్షణ తరగతులు

**– బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్**



మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 04 మార్చి

ఈరోజు మెదక్ అసెంబ్లీ రామాయంపేట పట్టణంలో 9.10 తారీఖున జరగబోయే ప్రశిక్షణ మహా అభ్యాన్ శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని నిర్వహించటకై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని అక్కడున్న నాయకులు మరియు ఈ యొక్క కార్యక్రమాన్ని సంబంధించిన కన్వీనర్లను మరియు ఇన్చార్జిలను కోరడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా జీవీస్ శ్రీనివాస్ గారు. పబ్బా సత్యం గారు . సిద్ధి రాములు గారు. అవినాష్ రెడ్డి.కార్తీక్, లావణ్య, బాసం అనిల్, వెలుముల సిద్దారంలు, గోపిశెట్టి రమణ, నాగరాజు, దయానంద్ రెడ్డి పాల్గొనడం జరిగింది.

## కొబ్బరికాయ కొట్టి ప్రభ బండ్లను ప్రారంభించిన బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి



నర్సంపేట మార్చి 4 తెలంగాణ పత్రిక

నర్సంపేట నియోజకవర్గం, నర్సంపేట పట్టణంలో బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన కొమ్మలా శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ప్రభ బండిని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి . ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, పట్టణ నాయకులు బాల్నె జగన్. వడ్డేపల్లి నరసింహారావు కౌన్సిలర్ అభ్యర్థులుపార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి...




తెలంగాణ పత్రిక బోధన మండలం. మార్చి 4..

నిజాంబాద్ జిల్లా బోధన్ పట్టణంలోనిబోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు అశోక్ రెడ్డి మొబి న్ హాస్పిటల్ లో గైనకాలజిస్ట్ వైద్యుడు ఎప్పుడు అందుబాటులో ఉండాలని వైద్యులు లేరు అన్న లోటును తీర్చాలని బోధన్ సబ్ కలెక్టర్కు ఒక వినతిపత్రం ఇవ్వడం అనంతరం ప్రభుత్వ హాస్పిటల్లో వైద్య సిబ్బందిని కలిసి పలు విషయాలపై చర్చించడం బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి చుట్టుపక్కల ఉన్న ప్రజలకు ఏప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని బి ఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు వైద్యులను కోరడం జరిగింది.

## జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా హోలీ వేడుకలు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 4




జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.ముందుగా జిల్లా పోలీస్ అధికారులంతా కలిసి ఎస్పీ క్యాంప్ కార్యాలయానికి వెళ్లి హోలీ వేడుకలకు ఎస్పీ రోహిత్ రాజును ఆహ్వానించారు.అక్కడ అధికారులు,సిబ్బంది రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.అనంతరం ఎస్పీతో కలిసి అధికారులంతా హేమచంద్రాపురం నందు గల పోలీస్ హెడ్ క్వార్టర్స్ నకు చేసుకుని పోలీస్ బ్యాండ్ చప్పుళ్లకు నృత్యాలు చేశారు.జిల్లా పోలీసు అధికారులు,సిబ్బంది హెడ్ క్వార్టర్స్ నందు ఆనందోత్సవాల మధ్య కేరింతలతో హోలీ వేడుకలను జరుపు కున్నారు. ఈ ఉత్సవాల్లో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పీ సతీష్‌కుమార్, మణు గూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలి

**– కామారెడ్డి జిల్లా కలెక్టర్**

కామారెడ్డి, మార్చి 4, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



పాఠశాలలు, వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు ఎస్పీ, డీఎఫ్ఓ, ఏసీ (ఎల్బీ), సబ్ కలెక్టర్, ఏసీ రెవెన్యూ (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా), డీపీఓ, డీఆర్డీఓ, సీఈఓ జెడ్పీ, డీఎంహెచ్ఓ, డబ్ల్యుఓ, డీఈఓ, ఎస్ఈ ఎన్పీడీసీఎల్, ఎంసీ కామారెడ్డి, డీఏఓ, డిహెచ్ఎస్ఓ, పీడీ హౌసింగ్, సీపీఓ, ఈఈ పీఆర్, ఆర్డీఓ, డీవైఎస్ఓ, అదనపు డీఆర్డీఓ (సెర్ప్), బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్లు (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా), పీడీ మేప్మా, సూపరింటెండెంట్ జి, ఈడీఎం, హెచ్‌హెచ్‌పి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కింద ఐదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను శాఖల వారీగా 10 థీమ్‌లతో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రణాళిక శాఖ ఈ కార్యక్రమానికి నోడల్ శాఖగా వ్యవహరిస్తుందని తెలిపారు. దశల వారీ కార్యక్రమాలు: ఏప్రిల్ 2 గ్రామ స్థాయి గ్రామసభలు, ఏప్రిల్ 16 మండల స్థాయి కార్యక్రమం, మే 2 నియోజకవర్గ స్థాయి కార్యక్రమం, మే 22 జిల్లా స్థాయి కార్యక్రమం, జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా రాష్ట్ర స్థాయి కార్యక్రమం, మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 99 రోజుల కాలంలో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. థీమ్‌ల వారీగా కార్యక్రమాలు: మార్చి 615: పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్‌పై ప్రత్యేక డ్రైవ్. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడిపొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ఏప్రిల్ 611: ఆరోగ్యం ఆరోగ్య శిబిరాలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు. ఏప్రిల్ 1318: "అరైవ్అలైవ్" కార్యక్రమం కింద రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల అమలు, హెల్మెట్‌సీట్‌బెల్ట్ తనిఖీలు. ఏప్రిల్ 2025: సంక్షేమం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాల అమలు సమీక్ష. ఏప్రిల్ 27మే 2: పిల్లల భద్రత డ్రగ్స్‌కు అడ్డుకట్టపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు. మే 49: రైతు సంక్షేమం వ్యవసాయం, సాగునీరు, ఎరువులువిత్తనాల సరఫరా, నిరంతర విద్యుత్ అందుబాటు. మే 1116: విద్య పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, హాజరు, బోధన నాణ్యతపై సమీక్ష. మే 1823: యువత, క్రీడలు క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు. మే 2530: మహిళలు స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగం. జూన్ 112: పర్యావరణం వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు. పరిశుభ్రత కార్యక్రమాలను మార్చి 6 నుంచి 16 వరకు విస్తృతంగా నిర్వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రహదారుల వెంట చెత్త నిర్మూలన, తడిపొడి చెత్త వేరు సేకరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో 100 శాతం పన్ను వసూళ్ల లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా సంఘాల రుణాల పంపిణీ, వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని స్పష్టం చేశారు.

**99 రోజుల ప్రజాపాలన లో భాగం గా ఉద్యాన , పట్టు పరిశ్రమ శాఖ ప్రణాళిక:** ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు సబ్సిడీ మీద అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుంది. ఆయిల్ పామ్ వేసుకున్న రైతుల వ్యవసాయ క్షేత్రలలో డిమాంస్ట్రేషన్స్ నిర్వహించడం జరుగుతుంది. పండ్ల తోటలు & కూరగాయల సాగు చేసే రైతులకి MIDH పథకం కింద ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సబ్సిడీ ల మీద అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుంది. వేసవి కాలంలో కూరగాయల సాగు ని పెంచడానికి రైతులకి కూరగాయల మినీ కిట్స్ నీ అందించి రైతులకి అవగాహన కల్పించడం జరుగుతుంది. మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ల గురించి తెలియచేసి, డ్రిప్ వాడకం దానివల్ల దిగుబడి ఎలా పెరుగుతుంది అని తెలియచేయడం జరుగుతుంది. పట్టు పరిశ్రమ శాఖ ద్వార అందిస్తున్న సబ్సిడీ గురించి రైతులకి అవగాహన కల్పించడం జరుగుతుంది. ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాలపై శాఖల వారీగా సమగ్ర రోజువారీ ప్రగతి నివేదికలు సమర్పించాలని, అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలి

**– పాఠశాలలు, వసతి గృహాల పై నిరంతర పర్యవేక్షణ అవసరం**

**– జిల్లా కలెక్టర్ అంకిత్.**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మార్చి 4



జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా, సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి ముందుగా జిల్లా అధికారులతో సమగ్ర దిశానిర్దేశం నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీల లో తడిపొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు సురక్షితంగా చేరుకోండి (ఎర్ర యు ఎల్ యు) కార్యక్రమం హోం రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించ బడుతుందని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల కఠిన అమలు, హెల్మెట్‌సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత రక్షణ డ్రగ్స్‌కు నో కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో అమలు చేయబడుతుందని చెప్పారు. మే 4 నుండి మే 9 వరకు రైతులు (వ్యవసాయం( అంశంపై వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్ శాఖలు సమన్వయంతో రైతులకు సాగు సలహాలు, ఎరువులువిత్తనాల లభ్యత, సాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మే 11 నుండి మే 16 వరకు విద్య అంశంపై పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై సమీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. మే 18 నుండి మే 23 వరకు యువత క్రీడలు అంశంపై క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టాలని సూచించారు. మే 25 నుండి మే 30 వరకు మహిళలు అంశంపై మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగంపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణం అంశంపై వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ 99 రోజుల కార్యాచరణ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో అమలు చేయబడుతుందని తెలిపారు. మార్చి 6న ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో కార్యాచరణపై గౌరవ మంత్రుల సమీక్ష సమావేశం నిర్వహించబడుతుందని వెల్లడించారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా హాజరుకావాలని ఆదేశించారు. మార్చి 6 నుండి 16 వరకు నిర్వహించనున్న పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, రహదారుల వెంట పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త నిర్మూలన, తడిపొడి చెత్త వేరు సేకరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలలో 100 శాతం పన్ను వసూళ్ల లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళా సంఘాల రుణాల పంపిణీ లక్ష్యాలను పూర్తిగా సాధించాలని, తక్కువ వసూళ్లు ఉన్న మండలాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల స్థాపన, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, శ్రీనిధి రుణాల 100 శాతం వసూళ్లపై కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను నిరంతర పర్యవేక్షణలో ఉంచి వసతి గృహాల్లో భోజన నాణ్యత, పారిశుద్ధ్య పరిస్థితులను ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల పర్యవేక్షణ పూర్తి బాధ్యత సంబంధిత అధికారులపైనే ఉంటుందని స్పష్టం చేశారు. వార్డు అధికారులతో మాట్లాడుతూ తమ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు స్థితి, గ్రౌండ్ లెవెల్ పురోగతి, పెండింగ్ కారణాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, చెత్త వాహనాలు, డ్రైనేజీ విస్తరణ వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం అత్యంత ముఖ్యమైన అంశమని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాల పూర్తి వివరాలను రోజువారీ ప్రగతి నివేదికల రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా పురోగతి, సమస్యలు, తీసుకున్న చర్యలు తదితర వివరాలు సమగ్రంగా నివేదికలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమం అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, మిషన్ భగీరథ ఈఈ లు తిరుమలేష్, నలిని, ఆర్ అండ్ బి నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఎస్సీ సంక్షేమ శాఖ శ్రీలత సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143

# కొమ్మల జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ గా విరాటి రవీందర్ రెడ్డి నియామకం

**- ఎమ్మెల్యే రేవూరికి కృతజ్ఞతలు తెలిపిన ఆలయ చైర్మన్ విరాటి రవీందర్ రెడ్డి**

పరకాల గీసుకొండ మార్చి తెలంగాణ పత్రిక

వరంగల్ జిల్లా గీసిగొండ మండలంలోని కొమ్మాల గ్రామ చివర్లో గల గుట్టపై స్వయంభుగా వెలిచిన ప్రసిద్ధిగాంచిన శ్రీ కొమ్మల లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 3నుండి 9 వరకు అంగరంగ వైభోగంగా కొనసాగుతాయి. శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ గా విరాటి రవీందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. కమిటీ ఎంపిక ప్రకటనను జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు, జాతర ఉత్సవాలు 3 నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జాతర ఉత్సవ కమిటీ ని ఎంపిక చేశారు, ఈ నూతన ఉత్సవ కమిటీలో 14 మంది సభ్యుల పేర్లను ఎండోమెంట్ శాఖ ప్రకటించింది ఈ నెల రెండు నుండి తొమ్మిదవ తేదీ వరకు కొనసాగనున్న ఈ ఉత్సవ కమిటీలో విరాటి రవీందర్ రెడ్డి అజ్మీర సమ్మయ్య కడారి సంతోష్ హళావత్ వీరన్న మంద రమేష్ బాదావత్ రమేష్ ఊరుకొండ రాజు లాడే రాజేశ్వరరావు గోనెల మల్లేష్ మండల నరేష్ మార్తాల రాజు దూకిర వినయ్ మామునూరి వనిత నాగిరెడ్డి నాగన్నను ప్రకటిస్తూ కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవదాయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ తో పాటు రాష్ట్ర జిల్లా దేవదాయ శాఖ సంబంధిత శాఖలకు జీవో కాపీలతో ఆదేశించినట్లు ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు.




# సాఫ్ట్వేర్ ఈ నామ్ అమలుపై అధికారులతో సమీక్షించిన కామారెడ్డి జిల్లా కలెక్టర్

కామారెడ్డి , మార్చి 4 ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

సాఫ్ట్వేర్ , ఈ-నామ్ అమలు పై కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం మినీ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య , కార్యదర్శులు వ్యాపారస్తులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ-నామ్ విధానం రైతులకు పారదర్శకతతో కూడిన, సులభమైన , లాభదాయకమైన మార్కెటింగ్ వ్యవస్థను అందిస్తుందని తెలిపారు. ముఖ్యంగా మద్నూర్ ఏఎంసీలో ఈ-నామ్ వ్యవస్థను ఖచ్చితంగా అమలు చేయాలని అలాగే, ఈ-నామ్ అమలులో వ్యాపారస్తులు పూర్తి సహకారం అందించాలని కోరారు.రైతులు, వ్యాపారులు అధికారులు సమన్వయం తో పనిచేస్తే మార్కెట్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఈ-నామ్ అమలు వేగవంతం చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



# అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాల పట్టివేత




మిర్యాలగూడ ప్రతినిధి//మార్చి 4:(తెలంగాణ పత్రిక):-

తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా ఇసుక మరియు మట్టిని రవాణా చేయడం నిరోధించడం గురించి ఆదేశాలు ఇవ్వగా అట్టి అక్రమ ఇసుక మరియు మట్టి రవాణాను నిరోధించడం కోసం పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తుండగా తేదీ 04.03.2026 రోజు మధ్యాహ్నం సమయంలో ఆలగడప టోల్గేట్ వద్దకు పెట్రో లింగ్ సిబ్బంది వెళ్లేసరికి నేరేడుచర్ల వైపు నుండి మిర్యాలగూడ వైపుకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు రాగా వాటి డ్రైవర్ల వద్ద మట్టి రవాణా అనుమతి పేపర్లో అడగగా వారి వద్ద ఎటువంటి అనుమతి పేపుల్ లేవు మరియు అట్టి టిప్పర్ నెంబర్లు TG 05 U 4786 మరియు TS 08 UF 0266 గా కలవు అట్టి వాటిని వెంటనే పట్టుబడి చేసి పోలీస్ స్టేషన్ తీసుకువచ్చి అట్టి టిప్పర్ వాహనాల యజమానులు మరియు డ్రైవర్ల మీద కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిం చనైనది, అదేవిధంగా సాయంత్రం మూడు గంటల సమయంలో కాల్వపల్లి వైపు నుండి మిర్యాలగూడ వైపు అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు 1) TS 29 TB 3911, 2) TS 05 UF 3758 అను వాటిని కూడా పట్టుబడి చేసి అట్టి ట్రాక్టర్ డ్రైవర్ మరియు ఓనర్లపై కేసు నమోదు చేయడం జరిగింది. మిర్యాలగూడ రూరల్ మండల పరిధిలోని గ్రామాల ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఎవరైనా అక్రమంగా ఇసుక కానీ మట్టిగానే తరలించుచున్నారు అని సమాచారం వచ్చినచో వెంటనే సమాచారం ఇవ్వగలరని తెలియజేశారు.

# జాతరలు తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీక

**- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

వేములపల్లి మార్చి 4( తెలంగాణ పత్రిక):-

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన జాతరలను ప్రతి ఒక్కరూ భాగస్వామ్యంగా జరుపుకుంటూ ఆనందాన్ని పంచుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని ఆమలగల్లు గ్రామంలో గల శ్రీ శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జాతరలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా గ్రామీణ సంస్కృతి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించే మహత్తర వేదికలని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేవాలయాలు, జాతరల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతుందని తెలిపారు. ఆలయాల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం పెరుగుతుందని, పర్యాటకాన్ని కూడా ప్రోత్సహించవచ్చని అన్నారు. జాతరలో భాగంగా గత మూడు రోజులుగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కబడ్డీ, కోలాటం, ఎడ్ల పందాలు వంటి సంప్రదాయ క్రీడా పోటీలను ఎమ్మెల్యే ఆసక్తిగా వీక్షించారు. అనంతరం ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ తరహా క్రీడలు యువతను క్రీడల వైపు ఆకర్షించడమే కాకుండా గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.అలాగే ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా జబర్దస్త్ కామెడీ కళాకారులతో నిర్వహించిన వినోద కార్యక్రమాల్లో పాల్గొని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భక్తులను ఉత్సాహపరిచారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన ప్రజలు నవ్వులు, ఆనందాల తో జాతర వాతావరణాన్ని మరింత ఉత్సవంగా మార్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్, సర్పంచులు పిల్లల సందీప్, ఎలికట్టి భరత్, జక్రిపోతుల మౌనిక, దేశి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మాలికాంతారెడ్డి, టీపీసీసీ సభ్యుడు చిరుమరి కృష్ణయ్య, స్వరాజ్యలక్ష్మి, కృపయ్య, రావు ఎల్లారెడ్డి, బిఎల్ఆర్ బ్రదర్స్తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొని జాతరను ఘనంగా నిర్వహించారు.



# వేములవాడ పట్టణంలోని జాతర గ్రౌండ్ సమీపంలోని ఓ లాడ్జిలో యువకుడి అనుమానాస్పద మృతి!



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 04, తెలంగాణ పత్రిక

వేములవాడ పట్టణంలోని జాతర గ్రౌండ్ వద్ద ఉన్న ఓలాడ్జిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలిస్తున్నారు. మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతికి గల కారణాలపై అనుమా నాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగి స్తున్నారు. ఈ ఘటన పై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# శృతిజ్ఞ అపార్ట్మెంట్స్‌లో ఘనంగా హోలీ వేడుకలు




(తిమ్మాపూర్ మండలం తెలంగాణ పత్రిక ప్రతినిధి) మార్చి-4

తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ శృతిజ్ఞ అపార్ట్మెంట్స్ కాలనీ వాసులు ఘనంగా హోలీ వేడుకలను జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు అందరూ రంగులు పూసుకుంటూ హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు డాన్సులు చేసుకుంటూ ఒకరు ఒకరు రంగులను చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హోలీ సంబరాలను సంతోషంగా, ఆనందంగా, ఘనంగా జరుపుకున్నారు. అపార్ట్మెంట్ వాసులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం హోలీ వేడుకలను అందరం కలసి ఘనంగా జరుపు కుంటామని, ప్రతి పండుగకు అపార్ట్ మెంట్ కమిటీ వారు ఏ కార్యక్రమం నిర్వహించిన అందరం కలిసి ఘనంగా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువతీ యువకులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# రోడ్డు పై అడ్డగోలుగా పార్కింగ్

**- సత్తిబాబు హోటల్ వద్ద వాహనదారులకు ఇక్కట్లు**

**- హోటల్ యజమానుల నిర్లక్ష్యంతో అవస్థలు**



మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఉప్పల్ మార్చ్ 4 తెలంగాణ పత్రిక

ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా దగ్గర గల సత్తిబాబు బిర్యానీ హోటల్ వద్ద అడ్డగోలు పార్కింగ్ తో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు హోటల్ వద్ద సరైన పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఇక్కడికొచ్చే వారు అడ్డగోలుగా రోడ్డు పైననే పార్కింగ్ చేస్తున్నారు. దీనిని సరి చేయాల్సిన హోటల్ యజమానులు సైతం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కస్టమర్లు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో వచ్చిపోయే ప్రజలు, వాహనదారులు ఇబ్బంది. పడుతున్నారు. ఇదే ప్రాంతంలో పిస్తా హౌస్, రాఘవేంద్ర హోటల్ వీటికి తోడు సత్తిబాబు బిర్యానీ హోటల్ వద్ద వాహనాల పార్కింగ్ కారణంగా వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతు న్నారు. ఇప్పటికైనా సత్తిబాబు హోటల్ యాజమాన్యం స్పందించి పార్కింగ్ విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులు కోరు తున్నారు. ఈ ప్రాంతంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత ట్రాఫిక్ పోలీసులపై ఎంతైనా ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.